
జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక



సంపుటి :13 సంచిక :73 సోమవారం | 16-11-2026 పేజీలు:8 వెల:రు 3

https://www.epaperjournalistdiary.com/

భారత గగనతలంలో
చైనా యుద్ధ విమానం!

- సిక్కిం ప్రాంతంలోకి చొరబడి 25 నిమిషాల పాటు చక్కర్లు
- 25 వేల అడుగుల ఎత్తులో విమాన కదలికల గుర్తింపు
- వెనక్కి వెళ్లాలంటూ భారత వైమానిక దళం హెచ్చరికలు
- అత్యంత సున్నితమైన సిలిగురి కారిడార్ సమీపంలో కలకలం
- చికెన్స్ నెక్ ప్రాంతంపై భద్రతా వర్గాల అప్రమత్తత
- గతంలోనూ లద్దాఖ్, ఉత్తరాఖండ్ ప్రాంతాల్లో చైనా కదలికలు
- డోక్లామ్ సమీపంలో మరోసారి ఉద్రిక్తతలకు ఆస్కారం
- సరిహద్దు భద్రతపై నిఘా పెంచిన భారత బలగాలు



02

ఢిల్లీలో పెరుగుతున్న
ఎయిర్ పొల్యూషన్

- 325కి పడిపోయిన ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్..
- వారం రోజులుగా వరుసగా క్షీణిస్తున్న వాతావరణ పరిస్థితులు
- నగరమంతటా దట్టంగా కమ్ముకుంటున్న పొగమంచు
- దారి కనిపించక వాహనదారుల ఇబ్బందులు
- బారాపుల్లా, జేఎల్ఎన్ స్టేడియం ప్రాంతాల్లో కాలుష్యం తీవ్రం
- ఢిల్లీ విశ్వవిద్యాలయం, పూసా, థిర్‌పూర్ ప్రాంతాల్లోనూ అధ్వాన్న స్థితి
- నోయిడాలోనూ పెరిగిన కాలుష్య తీవ్రత
- 300 దాటితే అత్యంత అధ్వాన్నంగా పరిగణించే గాలి నాణ్యత



02

₹30 వేల కోట్లు..
కావాలి


- కరువు కాటుకు కేంద్రం అండ కావాలి..
- ప్రధాని మోదీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ
- రైతు రక్షణకు 30 వేల కోట్ల ప్యాకేజీ కోరిన రేవంత్
- కరువు నివారణకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ కోరుతూ వినతి
- తుమ్మిడిహెట్టి, సమ్మక్క సాగర్ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి
- గోదావరి--కావేరి అనుసంధానంలో తెలంగాణకు 50 శాతం వాటా కోరిన సీఎం

తెలంగాణకు తక్షణ సాయం చేయండి

కరువు పరిస్థితులతో అల్లాడుతున్న తెలంగాణను ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి, సాగునీటి వనరుల్లో నీటి లభ్యత క్షీణించడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. కరువు నివారణ, రైతులకు అండగా నిలిచేందుకు రాష్ట్రానికి తక్షణమే రూ.30 వేల కోట్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఆదివారం న్యూఢిల్లీలో ప్రధాని మోదీతో జరిగిన సమావేశంలో ఈ మేరకు వినతిపత్రం సమర్పించడంతో పాటు తుమ్మిడిహెట్టి, సమ్మక్క సాగర్ ప్రాజెక్టులకు అనుమతులు, గోదావరి--కావేరి నదుల అనుసంధానంలో తెలంగాణకు 50 శాతం జలాల వాటా వంటి కీలక అంశాలను ప్రస్తావించారు.



02



02

టీమిండియా సంచలన విజయం

- వన్డే సిరీస్ కైవసం.. కివీస్ ఏడేళ్ల రికార్డుకు బ్రేక్
- న్యూజిలాండ్‌పై చివరి వన్డేలో 22 పరుగులరి తేడాతో గెలిచిన టీమిండియా
- సొంతగడ్డపై కివీస్ 7 ఏళ్ల సిరీస్ విజయాల రికార్డుకు బ్రేక్
- బ్యాటింగ్‌లో రాణించిన అక్షర్ పటేల్, ఇషాన్ కిషన్
- బౌలింగ్‌లో అదరగొట్టిన అర్ష్‌దీప్ సింగ్, సిరాజ్
- హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్‌కు విదేశాల్లో తొలి సిరీస్ విజయం

సీఎం చంద్రబాబును కలిసిన వైఎస్ షర్మిల..

- కుమార్తె వివాహానికి ఆహ్వానం
- సీఎం చంద్రబాబును ఆయన నివాసంలో కలిసిన ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల
- కుమార్తె వైఎస్ అంజలి రెడ్డి వివాహ ఆహ్వాన పత్రికను అందజేసిన షర్మిల
- కాబోయే దంపతులను ఆశీర్వదించాలని కోరినట్లు సోషల్ మీడియాలో పోస్ట్
- ఇప్పటికే పలువురు కీలక రాజకీయ ప్రముఖులను స్వయంగా ఆహ్వానించిన షర్మిల



05



కాంగ్రెస్‌కు అధికారం కల్లే!

- కాంగ్రెస్ పార్టీ ప్రజల హృదయాల్లో స్థానం కోల్పోయింది
- రాహుల్ ప్రతిపక్ష నేతగా ఉన్నంతకాలం పునరాగమనం కష్టమే
- ప్రధాని మోదీ నాయకత్వంపై ప్రజలకు బలమైన విశ్వాసం
- ప్రపంచ వేదికపై భారత్ ప్రతిష్ఠ పెరగాలంటే మోదీ కొనసాగాలి
- కాంగ్రెస్ నాయకత్వంపై ప్రజల్లో నమ్మకం లేదన్న ఈటల
- దేశవ్యాప్తంగా ఆ పార్టీకి ఆదరణ తగ్గిందని విమర్శ

హైదరాబాద్,

కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజల హృదయాల నుంచి ఎప్పుడో తొలగిపోయిందని, రాహుల్‌గాంధీ ప్రతిపక్ష నేతగా ఉన్నంతకాలం ఆ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశమే లేదని బీజేపీ నేత ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. నగరంలో జాతీయ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకత్వంపై విమర్శలు గుప్పించారు. దేశవ్యాప్తంగా ఆ పార్టీకి ప్రజాదరణ తగ్గిపోయిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు విశ్వాసం లేదని

-మిగతా 2 లో



అక్వాన్ తుపానుతో తెలంగాణకు
వర్ష ముప్పు

- ఈ నెల 20న ఉత్తర కోస్తా తీరాన్ని దాటే అవకాశం
- 20 నుంచి 22 వరకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు
- తూర్పు, దక్షిణ తెలంగాణలో అధికంగా వర్షాలు కురిసే సూచనలు
- ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు భారీ వర్ష సూచన
- మహబూబాబాద్, సూర్యాపేట, నల్గొండ, నాగర్‌కర్నూల్‌పైనా ప్రభావం
- 21, 22 తేదీల్లో మిగతా జిల్లాల్లో మోస్తరు వర్షాలు
- వరి కోతలు, ధాన్యం కొనుగోళ్ల నేపథ్యంలో రైతులకు అప్రమత్తత సూచన

హైదరాబాద్,

బంగాళాఖాతంలో ఏర్పడనున్న అక్వాన్ తుపాను ప్రభావం తెలుగు రాష్ట్రాలపై పడే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా తెలంగాణలో ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు పలు జిల్లాల్లో వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని ప్రముఖ వాతావరణ నిపుణుడు బాలాజీ తెలిపారు. తుపాను ప్రభావంతో ప్రస్తుతం కొనసాగుతున్న చలి వాతావరణంలోనూ మార్పులు చోటుచేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రజలు, రైతులు, అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అంచనాల ప్రకారం అక్వాన్ తుపాను ఈ నెల 20న ఉత్తర కోస్తా తీరాన్ని దాటే అవకాశం ఉంది. ఆ సమయంలో తెలంగాణలోనూ దాని ప్రభావం కనిపించవచ్చని

-మిగతా 2 లో

చైనా సరికొత్త ప్రయోగం..

- సీఈ-25ప పేరుతో భారీ విద్యుత్ విమానం అభివృద్ధి
- సుమారు 10 టన్నుల బరువుతో రూపకల్పన
- 19 మంది ప్రయాణికులను తీసుకెళ్లే సామర్థ్యం
- ఒక్కసారి ఛార్జింగ్‌తో 400 కిలోమీటర్ల ప్రయాణం
- గంటకు 300 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లే అవకాశం
- సుమారు 2,400 మీటర్ల ఎత్తులో ప్రయాణించేలా తయారీ
- భద్రతా పరీక్షలు, అనుమతులే కీలక సవాళ్లు

02

పైలట్ లేకుండానే ఎలక్ట్రిక్ విమానం!




02



05

జగన్ కుటుంబ మహిళలపై
అనుచిత పోస్టులు...

- తీవ్రంగా ఖండించిన ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ
- ట్విట్టర్ వేదికగా మహిళలను కించపరచడం అత్యంత హేయమైన చర్య అన్న రాయపాటి శైలజ
- రాజకీయాల పేరుతో మహిళల వ్యక్తిత్వ హననానికి పాల్పడడం తగదని స్పష్టీకరణ
- అసభ్య పోస్టులు పెట్టే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



02

రైల్వే పట్టాల పేలుడు కేసులో ఇద్దరి అరెస్ట్..

'నిత్యావసరాల 'ధరలు' పెంచి విజన్ కబుర్లు చెబుతారా?

-వైసిపి మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు

-విజన్ 2050 పేరుతో ప్రజలను చంద్రబాబు మోసం చేస్తున్నారన్న ధర్మాన

-నిత్యావసరాలు మరియు విద్యుత్ ఛార్జీల పెరుగుదలపై మాజీ మంత్రి మండిపాటు

-జగన్ కుటుంబ సభ్యులపై సామాజిక మాధ్యమాల్లో అసభ్య వ్యాఖ్యల వ్యవహారం

-నెల్లూరు వేదాయపాళెం పోలీస్ స్టేషన్‌లో వైసీపీ మహిళా విభాగం ఫిర్యాదు

-సైబర్ వేధింపులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కాకాని పూజిత డిమాండ్

అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపాదిస్తున్న 'విజన్ 2050'పై వైసీపీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. రాష్ట్రంలో ప్రస్తుత క్షేత్ర స్థాయి పరిస్థితులు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గాలికొదిలేసి ప్రభుత్వం కాలం గడుపుతోందని పార్టీ నేతలు ఆరోపించారు.

నిత్యావసర వస్తువుల ధరలు



ఆకాశాన్నంటుతుంటే సిఎం విజన్ 2050 గురించి మాట్లాడటం విడ్డూరం

ఆదివారం మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు మీడియాతో మాట్లాడుతూ....

రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతుంటే చంద్రబాబు విజన్ 2050 గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. ప్రస్తుత సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే ఇటువంటి దీర్ఘకాలిక ప్రణాళికల పేరిట ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో సామాన్యుడి కొనుగోలు శక్తి భారీగా పడిపోయిందని, ప్రజల జీవనం తీవ్ర ఇబ్బందుల్లో పడిందని పేర్కొన్నారు.

నిత్యావసరాలు, ఇంధన ధరలు విపరీతంగా పెరిగాయి

ప్రభుత్వం బిజినెస్ సమ్మిట్‌ల పేరుతో విలువైన భూములను కారు చౌకగా కట్టబెడుతోంది 2024 నాటి ధరలతో పోలిస్తే ప్రస్తుతం నిత్యావసరాలు, ఇంధన ధరలు విపరీతంగా పెరిగాయని ధర్మాన ప్రసాదరావు తెలిపారు. విద్యుత్ ఛార్జీల పెంపు సామాన్య ప్రజలపై తీవ్ర భారాన్ని మోపిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా పక్కనబెట్టిన ప్రభుత్వం, బిజినెస్ సమ్మిట్‌ల పేరుతో విలువైన భూములను కారు చౌకగా ఇతరులకు కట్టబెడుతోందని విమర్శించారు. ప్రజా సమస్యలను పట్టించుకోని ఇలాంటి విధానాలను ప్రజలు తిరస్కరించాలని ఆయన పిలుపునిచ్చారు.జగన్ కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని ఎక్స్' స్పేసెస్‌లో అసభ్యకర వ్యాఖ్యలు చేయడంపై వైసీపీ మహిళా నేత తీవ్ర ఆగ్రహంమరోవైపు, మాజీ ముఖ్యమంత్రి జగన్ కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని సామాజిక మాధ్యమం 'ఎక్స్' స్పేసెస్‌లో అసభ్యకర వ్యాఖ్యలు

-మిగతా 2 లో

ఢిల్లీలో పెరుగుతున్న ఎయిర్ పొల్యూషన్..



న్యూఢిల్లీ
దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకూ పెరుగుతున్నది. గత వారం రోజులుగా గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) వరుసగా క్షీణిస్తుండటంతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరంలోని పలు ప్రాంతాలను దట్టమైన పొగమంచు కమ్మేస్తున్నది. దీనివల్ల రహదారులపై ఎదురుగా వస్తున్న వాహనాలు, దూరంలోని వస్తువులు స్పష్టంగా కనిపించడం లేదు. ముఖ్యంగా ఉదయం, రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనదారులు అప్రమత్తంగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాజా గణాంకాల ప్రకారం ఢిల్లీలో సగటు గాలి నాణ్యత సూచీ 325కు పడిపోయింది. దీంతో నగరంలో కాలుష్య తీవ్రత ఆందోళనకరంగా మారింది. పలు ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. బారాపుల్లా, జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం పరిసరాల్లో గాలి నాణ్యత గణనీయంగా క్షీణించింది. ఢిల్లీ విశ్వవిద్యాలయం ప్రాంతం, పూసా, ధిర్‌పూర్ ప్రాంతాల్లోనూ గాలి నాణ్యత అత్యంత అధ్వాన్న స్థాయికి చేరింది. రాజధాని పరిసర ప్రాంతమైన నోయిడాలోనూ వాయు కాలుష్యం పెరిగింది. ఢిల్లీతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ పొగమంచు, కాలుష్యం ప్రభావం కనిపిస్తున్నది. గాలిలో కాలుష్య కారకాలు పెరగడంతో సాధారణ జీవనంపై ప్రభావం పడుతున్నది. రహదారులపై ప్రయాణాలు ఇబ్బందికరంగా మారడంతో పాటు బహిరంగ ప్రదేశాల్లో సంచరించే ప్రజలు కూడా అసౌకర్యానికి గురవుతున్నారు..


టీమిండియా సంచలన విజయం..



న్యూఢిల్లీ,
మౌంట్ మాంగనూయిలోని బే ఓవల్ వేదికగా జరిగిన ఆఖరి వన్డేలో భారత జట్టు అద్భుత పోరాట పటిమ కనబరిచింది. తక్కువ స్కోరు నమోదైన ఉత్కంఠ పోరులో న్యూజిలాండ్‌పై 22 పరుగుల తేడాతో విజయం సాధించి, వన్డే సిరీస్‌ను 3-1 తేడాతో కైవసం చేసుకుంది. ఈ విజయంతో కివీస్ గడ్డపై న్యూజిలాండ్‌కు ఉన్న సుదీర్ఘ అజేయ రికార్డుకు భారత్ తెరదించింది. గత ఏడేళ్లలో సొంతగడ్డపై వరుసగా 11 ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లను గెలుచుకున్న న్యూజిలాండ్‌కు ఇది ఊహించని షాక్. 2019 తర్వాత కివీస్ జట్టు తమ దేశంలో వన్డే సిరీస్ కోల్పోవడం ఇదే తొలిసారి కాగా, అప్పుడు కూడా భారత్ చేతిలోనే పరాజయం పాలవడం విశేషం. అంతేకాకుండా భారత హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత గౌతమ్ గంభీర్‌కు విదేశాల్లో ఇదే తొలి వన్డే సిరీస్ విజయం. 210 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ 48.1 ఓవర్లలో 187 పరుగులకే కుప్పకూలింది. పిచ్ పరిస్థితులను సరిగ్గా అర్థం చేసుకున్న తాత్కాలిక కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ వ్యూహాత్మకంగా పేసర్లకే ఎక్కువ ఓవర్లు ఇచ్చాడు. 36వ ఓవర్ వరకు స్పిన్నర్లను తీసుకురాకుండా పేస్ ఎటాక్‌తోనే కివీస్ బ్యాటర్లను కట్టడి చేశాడు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 3 వికెట్లతో రాణించగా, సిరాజ్ 2, అక్షర్ పటేల్ 2 వికెట్లు తీశారు. అరంగేట్రం చేసిన యశ్ ఠాకూర్, ఆకిబ్ నబీ తలో వికెట్ దక్కించుకున్నారు. కీలక సమయంలో నమన్ ధీర్ కివీస్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ (24) వికెట్ తీసి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పాడు. అంతకుముందు, టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా 42.1 ఓవర్లలో 209 పరుగులకు ఆలౌట్ అయింది. సీనియర్ బ్యాటర్లు రోహిత్ శర్మ (7), విరాట్ కోహ్లీ (5) తీవ్రంగా నిరాశపరిచారు. అయితే అక్షర్ పటేల్ (46), ఇషాన్ కిషన్ (46) బాధ్యతాయుతంగా ఆడి జట్టును ఆదుకున్నారు. ఆఖర్లో మహ్మద్ సిరాజ్ (14 నాటౌట్), అర్ష్‌దీప్ సింగ్ (14) చివరి వికెట్‌కు జోడించిన 28 పరుగులు మ్యాచ్ ఫలితంలో అత్యంత కీలకంగా మారాయి.

రైల్వే పట్టాల పేలుడు కేసులో ఇద్దరి అరెస్ట్..

-పాక్ హ్యాండ్లర్లతో సంబంధాలు!



చండీగఢ్
రైలు పట్టాలను పేల్చేసిన కేసులో ఒక మహిళ, ఒక వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమె నుంచి రెండు ఆయుధాలు, 46 కాట్రిడ్జ్‌లు, కొంత నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆ మహిళకు పాకిస్థాన్‌తో సంబంధాలున్నట్లు పోలీస్ దర్యాప్తులో తేలింది. నవంబర్ 3న రాత్రి 9:45 గంటల సమయంలో రాజస్థాన్‌లోని శ్రీ గంగానగర్ జిల్లా రామ్‌సింగ్‌పూర్ సమీపంలోని రైలు పట్టాలపై పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి రెండు రైల్వే స్లీపర్లు ధ్వంసం కావడంతో పాటు రెండున్నర అడుగుల లోతులో ఒక గొయ్యి ఏర్పడింది. అక్కడి రైలు పట్టాలకు నష్టం వాటిల్లింది. ఈ పేలుడుకు 75 నిమిషాల ముందు అనూప్‌గఢ్-సూరత్‌గఢ్ ప్యాసింజర్ రైలు ఈ ట్రాక్‌పై ప్రయాణించింది. నిందితులు ఈ రైలును పేల్చేందుకు కుట్ర పన్నినట్లు పోలీసులు అనుమానించారు.

కాంగ్రెస్‌కు అధికారం కల్లే!

(మొదటి తరువాయి)

ఈటల రాజేందర్ అన్నారు. దేశ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవహరించడంలో ఆ పార్టీ నాయకత్వం విఫలమైందని విమర్శించారు. రాహుల్‌గాంధీ ప్రతిపక్ష నేతగా కొనసాగుతున్నంతకాలం కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా పునరుజ్జీవం లభించే అవకాశం లేదని అభిప్రాయపడ్డారు. ప్రజల మనసుల్లో స్థానం కోల్పోయిన పార్టీకి తిరిగి ఆదరణ పొందడం అంత సులభం కాదని వ్యాఖ్యానించారు. ప్రపంచవ్యాప్తంగా భారతదేశ ప్రతిష్ఠ, గౌరవం, కీర్తి మరింత పెరగాలంటే నరేంద్ర మోదీ ప్రధానిగా కొనసాగాల్సిన అవసరం ఉందని దేశ ప్రజలు బలంగా విశ్వసిస్తున్నారని ఈటల పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో భారత్ గౌరవాన్ని పెంచడంతోపాటు దేశ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లగల నాయకత్వంపై ప్రజలకు స్పష్టమైన అభిప్రాయం ఉందన్నారు. మోదీ నాయకత్వం కొనసాగాలన్నదే దేశ ప్రజల ఆకాంక్షగా అభివర్ణించారు. దేశ అభివృద్ధి, ప్రపంచ దేశాలతో భారత్ సంబంధాలు, అంతర్జాతీయ వేదికలపై దేశ ప్రతిష్ఠ వంటి అంశాల్లో ప్రజలకు స్పష్టత ఉందని ఆయన అన్నారు. మోదీ నాయకత్వంలో దేశం మరింత పురోగతి సాధిస్తుందన్న నమ్మకం ప్రజల్లో ఉందని పేర్కొన్నారు. మరోవైపు కాంగ్రెస్ నాయకత్వంపై విశ్వాసం లేకపోవడం వల్లే ఆ పార్టీకి దేశవ్యాప్తంగా ఆదరణ కరువైందని ఈటల రాజేందర్ విమర్శించారు.

భారత గగనతలంలో చైనా విమానం!

- సిక్కిం ప్రాంతంలోకి చొరబడి 25 నిమిషాల పాటు చక్కర్లు
- 25 వేల అడుగుల ఎత్తులో విమాన కదలికల గుర్తింపు
- వెనక్కి వెళ్లాలంటూ భారత వైమానిక దళం హెచ్చరికలు
- అత్యంత సున్నితమైన సిలిగురి కారిడార్ సమీపంలో కలకలం
- చికెన్స్ నెక్ ప్రాంతంపై భద్రతా వర్గాల అప్రమత్తత
- గతంలోనూ లద్దాఖ్, ఉత్తరాఖండ్ ప్రాంతాల్లో చైనా కదలికలు
- డోక్లామ్ సమీపంలో మరోసారి ఉద్రిక్తతలకు ఆస్కారం
- సరిహద్దు భద్రతపై నిఘా పెంచిన భారత బలగాలు



న్యూఢిల్లీ: చైనా మరోసారి భారత గగనతలంలోకి చొరబడినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ నెల 12న చైనాకు చెందిన ఓ సైనిక విమానం సిక్కిం ప్రాంతంలోని భారత గగనతలంలోకి ప్రవేశించి సుమారు 20 నుంచి 25 నిమిషాల పాటు చక్కర్లు కొట్టినట్లు తెలిపాయి. ఉదయం 8 గంటల సమయంలో 25 వేల అడుగుల ఎత్తులో విమాన కదలికలను భారత వైమానిక దళం గుర్తించినట్లు పేర్కొన్నాయి. వెంటనే అప్రమత్తమైన అధికారులు భారత గగనతలం నుంచి వెనక్కి వెళ్లాలని పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినట్లు వెల్లడించాయి. దేశ భద్రతాపరంగా అత్యంత సున్నితమైన సిలిగురి కారిడార్‌కు అభిముఖంగా ఈ ఘటన చోటుచేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. పశ్చిమ బెంగాల్‌లో ఉన్న సిలిగురి కారిడార్ భారతదేశానికి వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన భూభాగం. అత్యంత సన్నని ప్రాంతంలో దీని వెడల్పు సుమారు 20 నుంచి 22 కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. ఈశాన్య రాష్ట్రాలను దేశంలోని మిగిలిన ప్రాంతాలతో అనుసంధానించే ఈ మార్గాన్ని 'చికెన్స్ నెక్' అని కూడా పిలుస్తారు. చైనా, నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్ దేశాలకు సమీపంలో ఉండటంతో ఇక్కడ జరిగే సైనిక కార్యకలాపాలను భద్రతా సంస్థలు నిశితంగా పరిశీలిస్తుంటాయి. సిక్కిం రాష్ట్రం చైనాలోని టిబెట్ స్వయంప్రతిపత్తి ప్రాంతంతో సరిహద్దును పంచుకుంటుంది. వ్యూహాత్మకంగా కీలకమైన డోక్లామ్ పీఠభూమి కూడా దీనికి సమీపంలోనే ఉంది. సరిహద్దుల్లో చైనా సైనిక విమానాల కదలికలు ఆందోళన కలిగించడం ఇదే మొదటిసారి కాదు. గతంలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగిన సందర్భాల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. 2022 జూన్‌లో తూర్పు లద్దాఖ్‌లో భారత సైనిక స్థావరాలకు అత్యంత సమీపంగా చైనా సైనిక విమానం ప్రయాణించింది. భూతల సిబ్బంది, భారత రాడార్లు ఆ కదలికలను గుర్తించడంతో వైమానిక దళం అప్రమత్తమైంది. ఈ ఘటనపై భారత్ సైనిక మార్గాల ద్వారా చైనాకు తన అభ్యంతరాలను తెలియజేసింది. 2020లో తూర్పు లద్దాఖ్‌లో ఇరు దేశాల మధ్య సైనిక ప్రతిష్టంభన కొనసాగుతున్న సమయంలో చైనా హెలికాప్టర్లు వాస్తవాధీన రేఖకు సమీపంలో సంచరిస్తూ కనిపించాయి. ఎలాంటి చొరబాట్లనైనా అడ్డుకునేందుకు భారత వైమానిక దళం యుద్ధ విమానాలను రంగంలోకి దించింది. అయితే ఆ హెలికాప్టర్లు భారత గగనతలంలోకి ప్రవేశించలేదని అధికారులు తెలిపారు. 2017 అక్టోబరు 11న ఉత్తరాఖండ్‌లోని బరాహోటి ప్రాంతంలో రెండు చైనా హెలికాప్టర్లు చొరబడినట్లు సమాచారం వెలువడింది. తాజాగా ఈ నెల 7న లద్దాఖ్‌లో నాలుగు చైనా హెలికాప్టర్లు చొరబడినట్లు కూడా వెల్లడైంది. వరుస పరిణామాల నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లో చైనా సైనిక కదలికలపై భారత భద్రతా సంస్థలు నిఘా కొనసాగిస్తున్నాయి.

30 వేల కోట్లు.. కావాలి

- తెలంగాణకు తక్షణ సాయం చేయండి
- కరువు కాటుకు కేంద్రం అండ కావాలి..
- -ప్రధాని మోదీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ
- రైతు రక్షణకు 30 వేల కోట్ల ప్యాకేజీ కోరిన రేవంత్
- కరువు నివారణకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ కోరుతూ వినతి
- తుమ్మిడిహెట్టి, సమ్మక్క సాగర్ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి
- -గోదావరి--కావేరి అనుసంధానంలో తెలంగాణకు 50 శాతం వాటా కోరిన సీఎం



న్యూఢిల్లీ,
కరువు పరిస్థితులతో సతమతమవుతున్న తెలంగాణను ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు అండగా నిలిచేందుకు రాష్ట్రానికి తక్షణమే రూ.30 వేల కోట్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదని, సాగునీటి వనరుల్లో నీటి లభ్యత తగ్గడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. కరువు నివారణ చర్యలకు కేంద్రం తక్షణ సాయం అందించాలని కోరారు.ఆదివారం న్యూఢిల్లీలో ప్రధాని మోదీతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వాకిటి శ్రీహరి కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యలు, సాగునీటి ప్రాజెక్టులకు కేంద్ర అనుమతులు, నిధుల కేటాయింపు, అంతర్రాష్ట్ర జల వివాదాలు తదితర అంశాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గడం వల్ల వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావం పడిందని ముఖ్యమంత్రి వివరించారు. సాగునీటి వనరుల్లో నీరు తగ్గడంతో రైతులు పంటల సాగు విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కరువు ప్రభావాన్ని తగ్గించేందుకు, రైతులకు అవసరమైన సహాయం అందించేందుకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ అవసరమని పేర్కొన్నారు. రూ.30 వేల కోట్ల సాయం అందిస్తే కరువు నివారణ, సాగునీటి అవసరాలు, వ్యవసాయ రంగానికి సంబంధించిన కార్యక్రమాలను చేపట్టేందుకు వీలవుతుందని వివరించారు. ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి అవసరమైన కేంద్ర ప్రభుత్వ అనుమతులను త్వరగా మంజూరు చేయాలని రేవంత్‌రెడ్డి కోరారు. ప్రాజెక్టుకు అవసరమైన నిధులు కేటాయించడంతో పాటు మహారాష్ట్ర ప్రభుత్వ సమ్మతి పొందేందుకు కేంద్రం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్రంలోని సాగునీటి అవసరాలకు మరింత భరోసా లభిస్తుందని వివరించారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టు విషయంలోనూ కేంద్రం సహకారం అందించాలని సీఎం కోరారు. ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జల సంఘం అనుమతులను త్వరగా మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. నిర్మాణానికి అవసరమైన నిరభ్యంతర పత్రాన్ని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి ఇప్పించేందుకు కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరారు. అంతర్రాష్ట్ర సమన్వయంతో అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. గోదావరి--కావేరి నదుల అనుసంధాన ప్రతిపాదనపైనా ముఖ్యమంత్రి తన అభిప్రాయాలను ప్రధాని ముందు ఉంచారు. ఈ ప్రాజెక్టు అమలులో తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించాలని కోరారు. అనుసంధానం ద్వారా లభించే జలాల్లో రాష్ట్రానికి 50 శాతం వాటా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి న్యాయంగా దక్కాల్సిన నీటి వాటాకు ఎలాంటి విఘాతం కలగకుండా చూడాలని కోరినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, తెలంగాణలో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్‌కు హాజరుకావాలని ప్రధాని మోదీని రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. డిసెంబర్ 11 నుంచి 22 వరకు రాష్ట్రంలో నిర్వహించనున్న ఖోలో ఇండియా యువ క్రీడల ప్రారంభోత్సవ వేడుకలకు కూడా రావాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, క్రీడారంగ ప్రోత్సాహానికి సంబంధించిన కార్యక్రమాల్లో ప్రధాని భాగస్వామి కావాలని ముఖ్యమంత్రి ఆహ్వానించారు

అక్వాన్ తుపానుతో తెలంగాణకు వర్ష ముప్పు

(మొదటి తరువాయి)

బాలాజీ వివరించారు. ముఖ్యంగా తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో వర్షాల తీవ్రత ఎక్కువగా ఉండవచ్చని తెలిపారు. తుపాను కదలికలు, వాతావరణ పరిస్థితులను బట్టి వర్షాల విస్తీర్ణం, తీవ్రతలో మార్పులు ఉండవచ్చని పేర్కొన్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హెచ్చరించారు. మహబూబాబాద్, సూర్యాపేట, నల్గొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోనూ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడవచ్చని తెలిపారు. లోతట్టు ప్రాంతాలు, వర్షపు నీరు నిలిచే ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ నెల 21, 22 తేదీల్లో రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లోనూ తుపాను ప్రభావం కనిపించవచ్చని, పలుచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రాత్రి వేళల్లో చలి తీవ్రత కొనసాగుతోంది. తుపాను ప్రభావంతో మేఘావృత వాతావరణం, వర్షాలు ఏర్పడితే ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు చోటుచేసుకోవచ్చని అంచనా వేస్తున్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలు తాజా సూచనలను గమనించాలని నిపుణులు చెబుతున్నారు. వర్ష సూచన నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం పలు ప్రాంతాల్లో వరి కోతలు కొనసాగుతుండగా, మరికొన్ని చోట్ల ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఈ సమయంలో వర్షాలు కురిస్తే కోసిన పంట, కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉంది. అందువల్ల కోసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పరదాలతో కప్పి ఉంచడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కూడా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ధాన్యం నిల్వ చేసే ప్రదేశాల్లో తగిన ఏర్పాట్లు చేసుకోవడంతో పాటు, వర్షం కారణంగా రైతులకు నష్టం కలగకుండా అధికారులు పర్యవేక్షించాలని సూచిస్తున్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలు వాతావరణ శాఖ తాజా హెచ్చరికలను గమనించాలని, వర్షాల సమయంలో అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయకుండా జాగ్రత్త పడాలని బాలాజీ సూచించారు

చైనా సరికొత్త ప్రయోగం..



బీజింగ్
విమానయాన రంగంలో సరికొత్త సాంకేతిక ప్రయోగానికి చైనా శ్రీకారం చుట్టింది. సంప్రదాయ ఇంధన విమానాలకు ప్రత్యామ్నాయంగా విద్యుత్ ఆధారిత విమానాల తయారీపై దృష్టి సారించిన ఆ దేశం.. తాజాగా సీఈ-25ఏ పేరుతో భారీ ఎలక్ట్రిక్ విమానాన్ని అభివృద్ధి చేసినట్లు ప్రకటించింది. సుమారు 10 టన్నుల బరువున్న ఈ విమానాన్ని పైలట్ అవసరం లేకుండా స్వయంచాలకంగా ప్రయాణించే సామర్థ్యంతో రూపొందించినట్లు సమాచారం. విద్యుత్ ఆధారిత చోదక వ్యవస్థలు, స్వయంచాలక నియంత్రణ, కృత్రిమ మేధ సాంకేతికతలను సమన్వయం చేయడం ఈ ప్రయోగంలో ప్రత్యేకతగా నిలుస్తోంది. అయితే ఈ విమానం పూర్తిగా పైలట్ లేకుండా వాణిజ్య ప్రయాణాలు ప్రారంభించిందని భావించరాదు. ఈ ఏడాది ఫిబ్రవరి 2న తొలిసారిగా సిబ్బంది లేకుండా స్వయంచాలకంగా ప్రయాణించింది. అప్పటి నుంచి మొత్తం 19 మానవ రహిత పరీక్షా ప్రయాణాలను పూర్తి చేసింది. తాజాగా నవంబర్ 14న షాండోంగ్ ప్రావిన్స్‌లోని బిన్‌జౌ నగరంలో ఇద్దరు పైలట్లు, ఒక విమాన పరీక్షా ఇంజినీర్‌తో కలిసి తొలి సిబ్బందితో కూడిన పరీక్షా ప్రయాణాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఈ ప్రయాణంలో విమానం 60.4 కిలోమీటర్లు ప్రయాణించింది. 16 నిమిషాల 38 సెకన్ల పాటు గాలిలో ఉంది. విమానంలోని వ్యవస్థలన్నీ సాధారణంగా పనిచేశాయని తయారీ సంస్థ తెలిపింది. ఈ విమానాన్ని చైనాకు చెందిన వాణిజ్య విమానాల తయారీ సంస్థ కామ్‌క్ (కమర్షియల్ ఎయిర్‌క్రాఫ్ట్ కార్పొరేషన్ ఆఫ్ చైనా) అభివృద్ధి చేసింది. చైనా బ్యాటరీ తయారీ సంస్థ క్యాటిల్, షాంఘై జియావో టోంగ్ విశ్వవిద్యాలయం తదితర సంస్థలు కూడా ఈ ప్రాజెక్టులో భాగస్వాములుగా ఉన్నాయి. రెక్కలపై అమర్చిన విద్యుత్ ఆధారిత ప్రత్యేక గాలి చోదక వ్యవస్థలు ఈ విమానానికి శక్తిని అందిస్తాయి.

'నిత్యావసరాల 'ధరలు' పెంచి విజన్ కబుర్లు చెబుతారా?

(మొదటి తరువాయి)

చేయడంపై వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాని పూజిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దారుణమైన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, హోం మంత్రి వంగలపూడి అనిత ఎందుకు మౌనంగా ఉన్నారో సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు ఈ ఘటనను ఖండించకపోవడం అంటే ఆ వేధింపులను పరోక్షంగా ప్రోత్సహించడమేనని ఆమె ఆరోపించారు.

నెల్లూరులోని వేదాయపాళెం పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా వైసిపి ఫిర్యాదు

ఈ వ్యవహారంపై కాకాని పూజిత నేతృత్వంలోని పార్టీ మహిళా నేతల బృందం నెల్లూరులోని వేదాయపాళెం పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేసింది. ఆ ఎక్స్ పేసెస్ నిర్వహించిన వారు, అందులో పాల్గొని అసభ్యకరంగా మాట్లాడిన వారి వివరాలు, సాంకేతిక ఆధారాలను పోలీసులకు సమర్పించినట్లు ఆమె తెలిపారు. బాధ్యులందరిపై నిష్పాక్షిక దర్యాప్తు జరిపి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

వ్యక్తిత్వ హననానికి పాల్పడటం క్షమార్హం కాదన్న పూజిత


రాజకీయాల్లో విధానపరమైన విమర్శలు చేసుకోవడం సహజమేనని, ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్న మహిళలను విమర్శించినా అర్థం చేసుకోవచ్చని, అయితే ప్రజా జీవితంతో ఏమాత్రం సంబంధం లేని కుటుంబ సభ్యులు, మహిళలను లక్ష్యంగా చేసుకుని వ్యక్తిత్వ హననానికి పాల్పడటం క్షమార్హం కాదని పూజిత స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో జరుగుతున్న సైబర్ వేధింపులు మహిళలు, యువత, పిల్లలపై తీవ్ర మానసిక ప్రభావాన్ని చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమాలను వ్యక్తిగత దూషణలకు వేదికగా మారనివ్వడం మహిళల గౌరవానికే భంగకరమని, ఇటువంటి పోకడలను అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వం మరియు పోలీసు వ్యవస్థపై ఉందని ఆమె పేర్కొన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

మియాపూర్ నరేన్ గార్డెన్ లో ఘనంగా కమ్మ సంఘం
30 వ కార్తీక మాస వన భోజన మహోత్సవం

ముఖ్య అతిథిగా పాల్గొన్న కమ్మవారి సేవా సంఘాల రాష్ట్ర అధ్యక్షులు, పియేసి చైర్మన్ అరెకపూడి గాంధీ.





రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 15 (జర్నలిస్ట్ డైరీ) :

మియాపూర్ డివిజన్ పరిధిలోని నరేన్ గార్డెన్స్ లో జరిగిన కమ్మ సంఘం పఠాన్ చెరువు, బి.హెచ్.ఇ.ఎల్, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కమ్మ సంఘం 30 వ కార్తీక మాస వన భోజన మహోత్సవం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పియేసి చైర్మన్ ఆరెక పూడి గాంధీ. ఈ కార్యక్రమానికి తాళ్లూరి చంద్రమౌళి అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... కమ్మ సంఘం పఠాన్ చెరువు, బి.హెచ్.ఇ. ఎల్, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కమ్మ సంఘం 30 వ కార్తీక మాస వన భోజన మహోత్సవం నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉంది అని, కార్తీకమాసములో కాలనీ వాసులు, బంధువులు, స్నేహితులతో కలసి చెట్ల నీడలో (ప్రత్యేకించి ఉసిరి చెట్టు నీడన) కలసి భోజనం చేయటాన్ని వన భోజనం అంటారు. ప్రకృతితో మన బంధాన్ని గుర్తుచేసుకునే రోజుగా చెప్పవచ్చు అని తెలియచేశారు.వానా కాలం తర్వాత వచ్చే శీతాకాలంలో వచ్చే కార్తీక మాసంలో వచ్చే శ్వాసకోస వ్యాధులు, జ్వరాలు ప్రజలను ఇబ్బంది పెడుతుంటాయి. వనభోజనం కారణంగా వివిధ రకాల ఆయుర్వేద మొక్కలు, వృక్షాల నుండి వచ్చే గాలి అందరికి దివ్య ఔషధంగా పనిచేస్తోంది. వన భోజనాలు చేయడంవలన మన ఆరోగ్యం మాత్రమే కాదు, ప్రకృతిని కాపాడుకున్న వాళ్ళం అవుతాము అని, పర్యావరణ పరిరక్షణ అనే భావన ఈ వనభోజనాలలో అంతర్లీనంగా దాగి ఉంది అని. ప్రకృతిని మనం కాపాడుకుంటే ప్రకృతి మనల్ని కాపాడుతుందనే సందేశం ఈ వనభోజనాలలో దాగి ఉంది అని తెలియచేశారు. వన భోజనాలు వంటి కార్యక్రమాలలో పాల్గొనడం వలన నాయకత్వ లక్షణాలు రావడం, బాధ్యతలు ఏర్పడటం, బంధు మిత్రుల మధ్య సాన్నిహిత్యం, భావ వ్యక్తీకరణ నైపుణ్యం పెరుగుతుంది అని , సంబంధ బాంధవ్యాలు మరింత బలపడతాయి అని తెలియచేశారు.ఈ కార్యక్రమంలో కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్, తెలంగాణ రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ మన్నే సతీష్ కుమార్, ఘట్టమనేని బాబురావు, సీనియర్ నాయకులు మొవ్వ సత్యనారాయణ, ప్రైమ్ మార్క్ అధినేత సాంబశివరావు, డీసీ లు బాలకృష్ణ, తాన్య, తాజా మాజీ కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, నార్నె శ్రీనివాసరావు, కమ్మ వారి సేవా సంఘాల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి పాతూరి వెంకట రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పినపాక ప్రభాకర్ , నాయకులు బ్రహ్మాజీ, చక్రవర్తి, వెంకటేశ్వర్ రావు మరియు కమ్మసంఘం కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దివ్య శ్రీ శక్తి అపార్ట్మెంట్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక మాస వన భోజన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న గాంధీ.



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 15 (జర్నలిస్ట్ డైరీ) :

మియాపూర్ డివిజన్ పరిధిలోని మయూరి నగర్ కాలనీ లో గల రాక్ గార్డెన్ పార్క్ లో దివ్య శ్రీ శక్తి అపార్ట్మెంట్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక మాస వన భోజన మహోత్సవం కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పియేసి చైర్మన్ శ్రీ ఆరెక పూడి గాంధీ.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ దివ్య శ్రీ శక్తి అపార్ట్మెంట్స్ అసోసియేషన్ కార్తీక మాస వన భోజన మహోత్సవం నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉంది అని, కార్తీకమాసములో కాలనీ వాసులు, బంధువులు, స్నేహితులతో కలసి చెట్ల నీడలో (ప్రత్యేకించి ఉసిరి చెట్టు నీడన) కలసి భోజనం చేయటాన్ని వన భోజనం అంటారు. ప్రకృతితో మన బంధాన్ని గుర్తుచేసుకునే రోజుగా చెప్పవచ్చు అని తెలియచేశారు.వానా కాలం తర్వాత వచ్చే శీతాకాలంలో వచ్చే కార్తీక మాసంలో వచ్చే శ్వాసకోస వ్యాధులు, జ్వరాలు ప్రజలను ఇబ్బంది పెడుతుంటాయి. వనభోజనం కారణంగా వివిధ రకాల ఆయుర్వేద మొక్కలు, వృక్షాల నుండి వచ్చే గాలి అందరికి దివ్య ఔషధంగా పనిచేస్తోంది. వన భోజనాలు చేయడంవలన మన ఆరోగ్యం మాత్రమే కాదు, ప్రకృతిని కాపాడుకున్న వాళ్ళం అవుతాము అని, పర్యావరణ పరిరక్షణ అనే భావన ఈ వనభోజనాలలో అంతర్లీనంగా దాగి ఉంది అని. ప్రకృతిని మనం కాపాడుకుంటే ప్రకృతి మనల్ని కాపాడుతుందనే సందేశం ఈ వనభోజనాలలో దాగి ఉంది అని తెలియచేశారు. వన భోజనాలు వంటి కార్యక్రమాలలో పాల్గొనడం వలన నాయకత్వ లక్షణాలు రావడం, బాధ్యతలు ఏర్పడటం, బంధు మిత్రుల మధ్య సాన్నిహిత్యం, భావ వ్యక్తీకరణ నైపుణ్యం పెరుగుతుంది అని ,సంబంధ బాంధవ్యాలు మరింత బలపడతాయి అని తెలియచేశారు.ఈ కార్యక్రమంలో దివ్య శ్రీ శక్తి అపార్ట్మెంట్స్ అసోసియేషన్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

24 గంటల్లోనే బంగారు గొలుసు చోరీ
కేసుఛేదించిన షాద్‌నగర్ పోలీసులు

2.5 తులాల బంగారు పుస్తెల తాడు స్వాధీనం, నిందితురాలి అరెస్ట్

షాద్‌నగర్ సిఐ సీతారాం వెల్లడి



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 15 (జర్నలిస్ట్ డైరీ) :

బంగారు ఆభరణాల దుకాణంలో చాకచక్యంగా దొంగతనానికి పాల్పడిన మహిళను షాద్‌నగర్ పోలీసులు 24 గంటల్లోనే గుర్తించి అరెస్టు చేశారు. ఆమె వద్ద నుంచి చోరీకి గురైన 2.5 తులాల బంగారు పుస్తెల తాడును పూర్తిగా స్వాధీనం చేసుకున్నారు. షాద్ నగర్ సీఐ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం.. షాద్‌నగర్ రైల్వే స్టేషన్ రోడ్డులో శ్రీ కృష్ణ జ్యూవెలర్స్ పేరుతో దుకాణం నిర్వహిస్తున్న కొత్త రఘువీర్ గుప్తా వద్దకు ఈ నెల 12వ తేదీ మధ్యాహ్నం సుమారు 2.30 గంటల సమయంలో గుర్తుతెలియని మహిళ వచ్చింది. బంగారు చెవి కమ్మల వివిధ డిజైన్లు చూపించాలని సేల్స్ గర్ల్స్ గాయత్రి, ప్రణీతలను కోరింది. వారు ఆభరణాలు చూపిస్తున్న సమయంలో వారి దృష్టిని మరల్చి, ట్రేలో ఉంచిన సుమారు 2.5 తులాల బంగారు పుస్తెల తాడు గొలుసును ఎవరికీ తెలియకుండా అపహరించి వెళ్లిపోయింది. ఈ విషయాన్ని గుర్తించిన దుకాణ యజమాని నవంబర్ 13వ తేదీ రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 995/2026 కింద బీఎన్ఎస్ 318(4), 305 సెక్షన్లతో కేసు నమోదు చేశారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితురాలిని గుర్తించారు.

మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం పుల్పోనిపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి రాజమణి (45) ఈ చోరీకి పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనం చేసినట్లు ఆమె అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. ఆమె వద్ద నుంచి చోరీకి గురైన బంగారు పుస్తెల తాడును పూర్తిగా స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి, షాద్‌నగర్ డీసీపీ సిహెచ్. శిరీష రాఘవేందర్, ఏసీపీ ఎస్. లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ కె. సీతారాం ఆధ్వర్యంలో డీఎస్ఐ జి. శివారెడ్డి, క్రైమ్ టీమ్ సభ్యులు ఏఎస్ఐ హరూన్ ఖాన్, లింగమూర్తి, మోహన్, మహేష్, అశోక్ రెడ్డి, జాకీర్, విజయ్ కుమార్, అశోక్, సంతోష్ తదితరులు కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించారు. తక్కువ సమయంలోనే కేసును ఛేదించి చోరీ సొత్తును రికవరీ చేసిన పోలీసు బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.

పేద ఆర్యవైశ్య విద్యార్థులకు అండగా 'వైశ్య' బీద విద్యార్థుల వసతి గృహ కమిటీ'

-10 మంది విద్యార్థులకు 10 వేలు చొప్పున రూ.1లక్ష స్కాలర్‌షిప్‌ల పంపిణీ



కంభం,మార్కాపురం, జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :

కంభం పట్టణంలో వైశ్య బీద విద్యార్థుల వసతి గృహ కమిటీ ఆధ్వర్యంలో పేద ఆర్యవైశ్య విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక శ్రీ సుగ్రీవ నాగయ్య కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో 10 మంది పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10,000/-లు చొప్పున మొత్తం రూ.1,00,000/- ల ఆర్థిక సహాయాన్ని స్కాలర్ షిప్‌ల రూపంలో అందజేశారు.ఉన్నత విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఆర్థిక సహాయం అందజేత పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ ఆర్థిక సహాయాన్ని అందించినట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగాలన్నదే తమ కమిటీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి, వారి భవిష్యత్తుకు తమ కమిటీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.పేద విద్యార్థుల విద్యాభివృద్ధిని ప్రోత్సహిస్తూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు చేయూత అందించడం ఎంతో అభినందనీయమని పలువురు కొనియాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు బైసాని లక్ష్మీ వెంకట రంగనాయకులు, గౌరవ అధ్యక్షులు ఒగ్గు శ్రీనివాసులు, ఆలంపల్లి శివలింగయ్య, గోళ్ళ సుబ్బరత్నం (బాబు), తిరువీధి మల్లికార్జునరావు, మంచికంటి బాలుడు, పెరుమాళ్ళ రాజలింగయ్య, పులిపాటి కోటేశ్వరరావుతో పాటు విరాళ దాతలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సిద్దాపూర్ డంపింగ్ యార్డు రద్దు కొరకు ప్రజలు నిరాహార దీక్ష చేస్తుంటే కనిపించని ఎమ్మెల్యేకు.. గ్రామంలో అభివృద్ధి ప్రారంభోత్సవాలు చేసే అర్హత ఉందా?

శ్రీధరా చారి , ప్రధాన కార్యదర్శి, గ్రామ కమిటీ , సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ (SDVP JAC).



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 15 (జర్నలిస్ట్ డైరీ) :

సిద్దాపూర్ లో జేఏసి ఆధ్వర్యంలో జీవో 641 రద్దు చేయాలని గత 43 రోజులుగా ప్రజలు రోడ్డుపై కూర్చొని పోరాడుతున్నారు. అయినా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కి ఆ ప్రజల బాధలు కనిపించడం లేదా? అని సిద్దాపూర్ జేఏసి గ్రామ ప్రధాన కార్యదర్శి శ్రీధరా చారి ప్రశ్నించారు.

43 వరోజు రిలే నిరాహార దీక్షలో పాల్గొని ఆయన మాట్లాడుతూ.... శాతానికి శాసన సభ్యులు సిద్దాపూర్ గ్రామం వచ్చి దీక్షా శిబిరం పక్క నుంచే వెళ్లినా కనీసం ఆగి ప్రజలను పలకరించే బాధ్యత లేదా? మా సమస్యను వినే మనసు లేదా? అని అడిగారు. ప్రజల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యేకు.. అదే ప్రజల నిరసనను పట్టించుకునే బాధ్యత లేదా? అంటూ ప్రశ్నించారు. ఇక దీక్ష చేస్తున్న వారిని చూసి "సిగ్గులేకుండా టెంట్ కింద కూర్చున్నారు" అని వ్యాఖ్యానించడం మీ బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. ఆయన ప్రజా పోరాటాలను అవమానించటం అంటే ప్రజలను అవమానించినట్లే అవుతుంది అని అన్నారు. సిగ్గు మాకుందా? మీకుందా? మా గ్రామానికి GO 641 రద్దు చేయకుండా వచ్చి అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించడం అభివృద్ధి కాదు. ప్రజల ప్రధాన సమస్యను పక్కనపెట్టి వెళ్లడం ప్రజాసేవ కాదు! మాకు పదవులు, హామీలు, గాలి మాటలు అవసరం లేదు. కావాల్సింది ఒక్కటే జీవో నం.641 రద్దుపై స్పష్టమైన అధికారిక ప్రకటన చేయాలి అని డిమాండ్ చేశారు. మా దీక్షను అవమానిస్తే మా పట్టుదల మరింత పెరుగుతుంది అని . మా గొంతును నిర్లక్ష్యం చేస్తే మా ఉద్యమం మరింత ఉధృతమవుతుంది అని జీవో రద్దు అయ్యే వరకు మా పోరాటం ఆగదు. వెనక్కి తగ్గేది లేదు అన్నారు. ఈ కార్యక్రమంలో రాజేందర్ రెడ్డి, గూని మహేష్, వడ్డే మల్లేష్, నగేష్ నాయక్ మరియు పిలిచింతకుంట తండా వాసులు , సిద్దాపూర్ ప్రజలు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీ సినియర్ నేత కుమార్ గౌడ్ కుమార్తె వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎంఎల్సీ నవీన్ కుమార్ రెడ్డి

- పాల్గొన్న ప్రముఖులు పాతూరి వెంకట రావు, పినపాక ప్రభాకర్.



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 15 (జర్నలిస్ట్ డైరీ) :

శంషాబాద్‌లోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో షాద్‌నగర్ పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు లింగారం కుమార్ గౌడ్ కుమార్తె వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ వేడుకకు మహబూబ్ నగర్ స్థానిక సంస్థల శాసన మండలి సభ్యులు నవీన్ కుమార్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. వీరితో పాటు ప్రముఖ పొల్టీ పారిశ్రామిక వేత్త పాతూరి వెంకట రావు మరియు ఉద్యమ కారుడు, కార్మిక నేత పినపాక ప్రభాకర్ లు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వంకాయల రామ్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ మాదారం నర్సిములు గౌడ్, మాజీ ఎంపిటిసి కట్న రవీందర్, ఉపసర్పంచ్ విక్రమ్ రెడ్డి,నాయకులు జగన్ రెడ్డి,జయరాం గౌడ్,ఆంజనేయులు గౌడ్,రమేష్ గౌడ్, దినేష్ సాగర్,శివ చారి, అన్వారీ రాజు, కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

2009 -2010 టెన్త్ బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనం.. దోమ లొ కలుసుకున్న చిన్ననాటి స్నేహితులు!





జర్నలిస్ట్ డైరీ
దోమ నవంబర్ 15

వికారాబాద్ జిల్లా దోమ మండలానికి చెందిన 2009 -2010పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనంలో సందడి చేశారు. చదువుకున్న రోజుల్లోని మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఒకచోట చేరి ఆనందంగా గడిపారు.చాలా కాలం తర్వాత కలుసుకున్న స్నేహితులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ, పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. చిన్ననాటి స్నేహబంధాలను మరింత బలోపేతం చేసుకుంటూ, ఆప్యాయతలు, అనురాగాలను పంచుకున్నారు.విద్యార్థి దశలో ఏర్పడిన స్నేహం జీవితాంతం కొనసాగుతుందని ఈ ఆత్మీయ సమ్మేళనం మరోసారి చాటిచెప్పింది. ఈ కార్యక్రమం స్నేహితులందరిలో నూతన ఉత్సాహాన్ని నింపింది.

ఏపీలో మేయర్, చైర్ పర్సన్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల ఖరారు

-రాజమండ్రి కార్పొరేషన్ సహా రెండు మున్సిపాలిటీలకు బీజేపీ అభ్యర్థులు ఖరారు
-మున్సిపల్ అభ్యర్థుల జాబితాను విడుదల చేసిన -బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



విజయవాడ, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ

ఆంధ్రప్రదేశ్‌లో మేయర్, చైర్ పర్సన్ ఎన్నికలకు సంబంధించి బీజేపీ కసరత్తును వేగవంతం చేసింది. బరిలో నిలపబోయే అభ్యర్థుల పేర్లను పార్టీ సోషల్ మీడియాలో విడుదల చేసింది. ఈ మేరకు ఎంపిక చేసిన అభ్యర్థుల వివరాలను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అధికారికంగా ప్రకటించారు.

సుదీర్ఘ చర్చల అనంతరం జాబితాను ఖరారు

పార్టీలో అంతర్గతంగా సుదీర్ఘంగా సాగిన చర్చల అనంతరం ఈ జాబితాను ఖరారు చేశారు. ప్రధానంగా అభ్యర్థుల గెలుపు అవకాశాలు, స్థానికంగా పార్టీ బలం, వివిధ సామాజిక సమీకరణాలను సమగ్రంగా పరిశీలించి నిర్ణయం తీసుకున్నారు.రాష్ట్రంలో చారిత్రక ప్రాధాన్యం కలిగిన రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా రేలంగి శ్రీదేవి పేరును బీజేపీ ఖరారు చేసింది. క్షేత్రస్థాయి ప్రజలతో ఉన్న సత్సంబంధాలు, నగరంలోని పౌర సమస్యలపై ఆమెకు ఉన్న పట్టు పార్టీకి ప్రధాన బలాలని నాయకత్వం భావిస్తోంది. మరోవైపు, నెల్లూరు జిల్లా పరిధిలోని కావలి మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థిగా భరత్ కుమార్‌ను పార్టీ ఎంపిక చేసింది. అలాగే బాపట్ల మున్సిపాలిటీ అభ్యర్థిగా సునీల్ కుమార్ పేరును ప్రకటించారు.పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా ఈ ఎన్నికల్లో ముందుకు వెళ్లనున్నట్లు పార్టీ వర్గాలు స్పష్టం చేశాయి. కీలక స్థానాలకు అభ్యర్థుల ప్రకటన వెలువడటంతో ఆయా ప్రాంతాల్లోని బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. కార్యకర్తలు ఇప్పటికే క్షేత్రస్థాయి ప్రచార సన్నాహాల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని స్థానాలకు కాకుండా, ప్రాధాన్యత ఉన్న ప్రధాన స్థానాల వివరాలను మాత్రమే పార్టీ నాయకత్వం వెల్లడించింది.

ఆసియా కప్ గెలిచిన కుర్రాళ్లు.. జగన్ అభినందనలు

-ఆసియా కప్ గెలిచిన భారత అండర్-19 జట్టు
-జట్టుకు అభినందనలు తెలియజేసిన వైఎస్ జగన్
-యువ క్రికెటర్ల ప్రతిభ, ధైర్యాన్ని కొనియాడిన మాజీ సీఎం



అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :

ఆసియా కప్ విజేతగా నిలిచిన టీమిండియా అండర్-19 క్రికెట్ జట్టును ఏపీ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. అద్భుత ప్రదర్శనతో దేశం గర్వపడేలా చేశారని 'ఎక్స్' వేదికగా ప్రశంసించారు.పాకిస్థాన్ నిర్దేశించిన 338 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో భారత యువ క్రికెటర్లు అద్భుత పోరాట పటిమను కనబరిచారని కొనియాడారు. "కీలక సమయాల్లో వికెట్లు కోల్పోయినప్పటికీ, మన యువ క్రికెటర్లు సంయమనం కోల్పోకుండా ఆఖరి వరకు పోరాడి విజయాన్ని అందుకున్నారు" అని జగన్ పేర్కొన్నారు.ముఖ్యంగా చివర్లో మనల్ చౌహాన్, మోహిత్ ఉల్వ బాధ్యతాయుతంగా ఆడి జట్టుకు విజయాన్ని అందించారని పేర్కొన్నారు. ఈ గెలుపు జట్టులోని ఆటగాళ్ల అసాధారణ ప్రతిభ, ధైర్యం, పట్టుదలకు నిదర్శనమని కొనియాడారు. భవిష్యత్తులో ఈ యువ ఛాంపియన్లు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు

కరడుగట్టిన అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్

-కర్లపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రిన్స్ జ్యువెలరీ షాపులో చోరీకి పాల్పడిన అంతర్ జిల్లా దొంగల ముఠా
-నేరం జరిగిన రెండు రోజుల్లోనే నలుగురు నిందితులను అరెస్ట్ చేసిన ప్రత్యేక పోలీస్ బృందం
-నిందితుల నుంచి రూ.4 లక్షల విలువైన 2.387 కేజీల వెండి వస్తువులు,
-మహీంద్రా థార్ కారు, ద్విచక్ర వాహనం స్వాధీనం
-బాపట్ల, గుంటూరు జిల్లాల్లో వరుస చోరీలకు పాల్పడేందుకు పథకం రచించిన నిందితులు
-జిల్లా పోలీసుల వేగవంతమైన చర్యలతో భారీ చోరీల ప్రణాళిక భగ్నం
-కేసు వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్







బాపట్ల జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :

జిల్లా పోలీస్ యంత్రాంగం వేగవంతంగా స్పందించి చేపట్టిన చర్యలతో భారీ చోరీల ప్రణాళికను భగ్నం చేసినట్లు జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ తెలిపారు. బాపట్ల జిల్లా కర్లపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రిన్స్ జ్యువెలరీ షాపులో జరిగిన దొంగతనం కేసును కర్లపాలెం పోలీసులు చాకచక్యంగా ఛేదించారు.ఈ మేరకు కరడుగట్టిన అంతర్ జిల్లా దొంగల ముఠాకు చెందిన నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి 2.387 కేజీల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.దీంతో పాటు, నేరానికి ఉపయోగించిన మహీంద్రా థార్ కారు, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. ఆదివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు.

వివరాల్లోకి వెళ్తే...10.11.2026 తేదీన తెల్లవారు జామున 3 గంటల సమయంలో బాపట్ల జిల్లా కర్లపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని కర్లపాలెం సెంటర్‌లో ఉన్న ప్రిన్స్ జ్యువెలరీ షాపు షట్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి, షాపులోని వెండి ఆభరణాలను దొంగిలించుకుని వెళ్లారు. ఈ ఘటనపై షాపు యజమాని షేక్. అబ్దుల్ ఖాదర్ జిలానీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే రోజు కర్లపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

దర్యాప్తు జరిగిన తీరు

బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ పర్యవేక్షణలో, బాపట్ల డీఎస్పీ సిహెచ్. చంద్ర మౌళి ఆధ్వర్యంలో బాపట్ల రూరల్ సీఐ బి. హరికృష్ణ, కర్లపాలెం ఎస్ఐ ఎస్. రవీంద్ర తమ స్టేషన్ సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు.ప్రత్యేక పోలీస్ బృందం ఘటనా స్థల పరిసరాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ దర్యాప్తును వేగవంతం చేసింది. ఈ క్రమంలో నేరానికి ఉపయోగించిన మహీంద్రా థార్ కారును గుర్తించి, దాని ఆధారంగా నిందితులను గుర్తించారు. వేజెండ్ల గ్రామానికి చెందిన వేజెండ్ల జోసెఫ్ అలియాస్ జుషప్ (24), జాగర్లమూడికి చెందిన మహమ్మద్ అబ్దుల్ రషీద్ (26), గరువుపాలెం గ్రామానికి చెందిన సైదుల మనోజ్ కుమార్ (24), తోమాటి వంశీ (26)లను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు.

చోరీ సొత్తు స్వాధీనం...

నిందితుల నుంచి సుమారు రూ.4,00,000/- విలువైన 2,387 గ్రాముల వెండి వస్తువులు, మహీంద్రా థార్ కారు, ఒక మోటార్ సైకిల్, దొంగతనానికి ఉపయోగించిన గడ్డపార, ఇనుప రాడ్డును స్వాధీనం చేసుకున్నారు.

చోరీ కోసం రెక్కీ...

ఈ ముఠా బాపట్ల, గుంటూరు జిల్లాల్లోని బాపట్ల, కర్లపాలెం, చెరుకుపల్లి, అంగళకుదురు, చేబ్రోలు తదితర ప్రాంతాల్లో ఇళ్లు, బంగారు ఆభరణాల దుకాణాలను ముందుగానే లక్ష్యంగా చేసుకుని రెక్కీ నిర్వహించింది. అనంతరం పక్కా ప్రణాళికతో వరుస దొంగతనాలకు పాల్పడేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా కర్లపాలెం సెంటర్‌లోని ప్రిన్స్ జ్యువెలరీ షాపు షట్టర్‌ను గడ్డపార, ఇనుప రాడ్డుతో పగులగొట్టి, అందులోని వెండి ఆభరణాలను దొంగిలించుకెళ్లింది.

రెండు రోజుల్లోనే నిందితుల అరెస్ట్

అయితే, నిందితులు మరిన్ని దొంగతనాలకు పాల్పడకముందే, మొదటి నేరం జరిగిన వెంటనే కర్లపాలెం పోలీసులు వేగంగా స్పందించి, కేవలం రెండు రోజుల్లోనే నిందితులను అరెస్ట్ చేయడంతో భారీ చోరీల ప్రణాళికను భగ్నం చేయగలిగారని ఎస్పీ తెలిపారు.

నిందితులు పాత నేరస్థులే...

అరెస్టయిన నలుగురు నిందితులపై గతంలోనూ పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో కేసులు నమోదై ఉన్నాయని, వీరి నేర చరిత్రను పరిశీలిస్తే వీరు పాత నేరస్థులని ఎస్పీ తెలిపారు.

ప్రధాన నిందితుడు ఏ1 వేజెండ్ల జోసెఫ్‌పై గతంలో చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో 2 కేసులు, తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 1 కేసు కలిపి మొత్తం 3 దొంగతనం కేసులు నమోదై ఉన్నాయి.ఏ2 మహమ్మద్ అబ్దుల్ రషీద్‌పై తెనాలి 3వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 3 కేసులు, పొన్నూరు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2 కేసులు, తెనాలి టూ టౌన్, చేబ్రోలు, ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఒక్కొక్క కేసు చొప్పున మొత్తం 8 కేసులు నమోదై ఉన్నాయి. వీటిలో 6 దొంగతనం కేసులు కాగా, 2 గంజాయి కేసులు ఉన్నాయి. అలాగే, ఏ3 సైదుల మనోజ్ కుమార్‌పై చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో 1 కేసు, ఏ4 తోమాటి వంశీపై బెల్లంకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో 1 కేసు నమోదై ఉన్నాయి.


పోలీస్ సిబ్బందికి ఎస్పీ అభినందనలు

కేసు నమోదైన వెంటనే వేగంగా స్పందించి, కేవలం రెండు రోజుల్లోనే నిందితులను అరెస్ట్ చేసి, మరిన్ని దొంగతనాలు జరగకుండా సమర్థవంతంగా అడ్డుకున్న బాపట్ల డీఎస్పీ సిహెచ్. చంద్ర మౌళి, బాపట్ల రూరల్ సీఐ బి. హరికృష్ణ, కర్లపాలెం ఎస్ఐ ఎస్. రవీంద్ర, హెడ్ కానిస్టేబుళ్లు ఐ. నరేష్, కె. శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు వి. శివ శంకర్ రావు, డి. రాకేష్ వర్మ, హోంగార్డు ఎం. దిలీప్ రెడ్డిలను జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ప్రత్యేకంగా అభినందించి, నగదు బహుమతులు అందజేశారు.ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఎల్.సుధాకర్, బాపట్ల డీఎస్పీ సిహెచ్. చంద్ర మౌళి ఆధ్వర్యంలో బాపట్ల రూరల్ సీఐ బి.హరికృష్ణ, కర్లపాలెం ఎస్ఐ ఎస్.రవీంద్ర, కర్లపాలెం స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీవారి భక్తులకు ఎస్వీ మ్యూజియం ఎంట్రీ.. ప్రత్యేక ఆకర్షణగా 'బ్రహ్మాండం గ్యాలరీ'

-లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆధునిక ఎస్వీ మ్యూజియం
-టీసీఎస్ సాంకేతిక సహకారంతో 14 ప్రత్యేక గ్యాలరీలు
-నవంబర్ 16 నుంచి సాధారణ భక్తులకు సందర్శన అవకాశం
-ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అనుమతి
-ప్రవేశ రుసుము ఒక్కొక్కరికి 50 రూపాయలు మాత్రమే







తిరుమల,ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :

కలియుగ ప్రత్యక్ష దైవం

శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువైన తిరుమల క్షేత్రంలో నూతనంగా ఆధునీకరించిన శ్రీ వేంకటేశ్వర మ్యూజియం (ఎస్వీ మ్యూజియం) భక్తులను విశేషంగా ఆకట్టుకునేందుకు సిద్ధమైంది. తిరుమల ప్రాశస్త్యం, సనాతన ధర్మ వైభవం, వేల ఏళ్ల చారిత్రక సంపదను ప్రతిబింబించేలా ప్రపంచ స్థాయి ప్రమాణాలతో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఈ మ్యూజియాన్ని తీర్చిదిద్దింది. నవంబర్ 16 నుంచి ఈ మ్యూజియం సాధారణ భక్తుల సందర్శనార్థం పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది.

టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ సాంకేతిక సహకారంతో మ్యూజియం అభివృద్ధి

టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) సాంకేతిక సహకారంతో నాలుగు అంతస్తుల్లో, దాదాపు లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ మ్యూజియాన్ని అభివృద్ధి చేశారు. ఇందులో మొత్తం 14 ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేశారు. దాదాపు 8,000కు పైగా పురాతన కళాఖండాలు, చారిత్రక ఆధారాలు, అరుదైన రాతి, కాంస్య శిల్పాలు, నాణేలు, పురాతన ఆయుధాలు, పూజా సంప్రదాయ వస్తువులతో పాటు ఆధునిక డిజిటల్ ప్రదర్శనలను ఇక్కడ కొలువుదీర్చారు.మ్యూజియంలో ప్రత్యేక ఆకర్షణగా 'బ్రహ్మాండం గ్యాలరీ' ఈ మ్యూజియంలో ప్రత్యేక ఆకర్షణగా 'బ్రహ్మాండం గ్యాలరీ' నిలవనుంది. విశ్వం, సృష్టి రహస్యాలు, బ్రహ్మాండ విస్తృతిని భక్తులకు కళ్లకు కట్టేలా అత్యాధునిక సాంకేతికతతో దీనిని రూపొందించారు. హోలో గ్రాఫిక్ ప్రదర్శనలు, 360 డిగ్రీల సౌండ్ సిస్టమ్, డిజిటల్ విజువల్స్ ద్వారా సరికొత్త అనుభూతిని అందించేలా చర్యలు తీసుకున్నారు. అలాగే పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనలు, సంప్రదాయ సంగీత వాయిద్యాల ప్రత్యేక గ్యాలరీ సంగీత, కళాభిమానులను విశేషంగా ఆకట్టుకోనుంది.

డిజిటల్ ఆర్కైవ్స్‌ను కూడా అందుబాటు లోకి

శ్రీవారి చరిత్ర, ఆలయ నిర్మాణ పరిణామ క్రమాన్ని భవిష్యత్ తరాలకు సులువుగా వివరించేలా డిజిటల్ ఆర్కైవ్స్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా 2026 సెప్టెంబర్ 16న ఈ నూతన మ్యూజియం ప్రారంభమైన సంగతి తెలిసిందే. కాగా, నవంబర్ 16 నుంచి సాధారణ భక్తుల సందర్శనార్థం టికెట్లను జారీ చేయనున్నారు.

అద్భుతమైన ఆధ్యాత్మిక, చారిత్రక విజ్ఞాన వేదికగా నిలవనున్న మ్యూజియం

ఈ మ్యూజియం సందర్శనకు ప్రవేశ రుసుముగా ఒక్కొక్కరికి రూ. 50 చొప్పున నిర్ణయించారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మ్యూజియాన్ని సందర్శించవచ్చు. టికెట్లను సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే జారీ చేస్తారు. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే యాత్రికులు, పరిశోధకులు, విద్యార్థులకు ఈ మ్యూజియం ఒక అద్భుత ఆధ్యాత్మిక, చారిత్రక విజ్ఞాన వేదికగా నిలవనుంది

బంగాళాఖాతంలో తీవ్రరూపం దాల్చిన వాయుగుండం.. ఏపీకి 'అక్వాన్' గండం


-బంగాళాఖాతంలో వాయుగుండం

-నేడు తుపానుగా, ఎల్లుండికి తీవ్ర తుపానుగా మారే అవకాశం

-రాగల రెండు రోజుల్లో ఏపీ తీరం వైపు కదిలే ఛాన్స్

-నవంబర్ 19, 20 తేదీల్లో కోస్తాంధ్రలో అత్యంత భారీ వర్షాలు

-తీరం వెంబడి గంటకు 60 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు



అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం క్రమంగా బలపడుతూ ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తోంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగిన తీవ్ర అల్పపీడనం వాయుగుండం గా మారి ప్రస్తుతం ఆగ్నేయ, దానిని ఆనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతం ప్రాంతంలో కేంద్రీకృతమై ఉంది. ఇది ఉత్తర-వాయవ్య దిశగా కదులుతూ మరింత బలపడనుందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.

నవంబర్ 17 నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా....

వాతావరణ శాఖ వివరాల ప్రకారం, ఈ వాయుగుండం నవంబర్ 16 నాటికి దక్షిణ బంగాళాఖాతం మధ్య ప్రాంతాలు, పశ్చిమ మధ్య బంగాళాఖాతాన్ని ఆనుకుని తుపానుగా మారనుంది. ఆ తర్వాత నవంబర్ 17 నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా బలపడనుంది. అనంతరం మరింత తీవ్రరూపం దాల్చి, రాగల రెండు రోజుల్లో వాయవ్య దిశగా కదులుతూ ఆంధ్రప్రదేశ్ తీరం వైపునకు దూసుకువచ్చే అవకాశముంది. ఇది తుపానుగా మారితే దీనిని 'అక్వాన్' అని పిలవనున్నారు.

కోస్తాంధ్ర, యానాంల లోని చాలా ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు

ఈ తుపాను ప్రభావంతో నవంబర్ 19, 20 తేదీల్లో కోస్తాంధ్ర, యానాంలలోని చాలా ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, కొన్నిచోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. నవంబర్ 18 నుంచే కోస్తాంధ్రలో అక్కడక్కడ భారీ వర్షాలు ప్రారంభమవుతాయి. రాయలసీమలో నవంబర్ 19, 20 తేదీల్లో భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నాయి.

తెలంగాణలోనూ నవంబర్ 20న పలుచోట్ల భారీ వర్షాలు

తెలంగాణలోనూ నవంబర్ 20న పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడులో నవంబర్ 18, 19 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, ఒడిశాలో నవంబర్ 19 నుంచి 21 వరకు భారీ వర్షాలు నమోదయ్యే వీలుంది.నవంబర్ 18 నుంచి 20 వరకు కోస్తాంధ్ర, యానాం, తమిళనాడు, పుదుచ్చేరి తీర ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో, గరిష్ఠంగా 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. ఉరుములు, మెరుపులతో కూడిన వాతావరణం నెలకొంటుంది. నవంబర్ 20న తెలంగాణలోనూ బలమైన ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది

జగన్ కుటుంబ మహిళలపై అనుచిత పోస్టులు...

-తీవ్రంగా ఖండించిన ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ

-ట్విట్టర్ వేదికగా మహిళలను కించపరచడం అత్యంత హేయమైన చర్య అన్న రాయపాటి శైలజ

-రాజకీయాల పేరుతో మహిళల వ్యక్తిత్వ హననానికి పాల్పడడం తగదని స్పష్టీకరణ

-అసభ్య పోస్టులు పెట్టే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
వైసీపీ అధినేత జగన్ కుటుంబ సభ్యులపై సోషల్ మీడియా వేదికగా జుగుప్సాకర వ్యాఖ్యలు చేయడాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ తీవ్రంగా ఖండించారు. మహిళలను కించపరిచేలా అనుచిత పోస్టులు పెట్టడం అత్యంత దారుణమని ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం అత్యంత హేయమైన చర్య రాజకీయ కక్షలు లేదా విభేదాల పేరుతో మహిళలను లక్ష్యంగా చేసుకోవడం సరికాదని రాయపాటి శైలజ స్పష్టం చేశారు. "ట్విట్టర్ వేదికగా మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం అత్యంత హేయమైన చర్య" అని ఆమె మండిపడ్డారు. రాజకీయాల పేరుతో మహిళలను అవమానించడం, వారి వ్యక్తిత్వ హననానికి పాల్పడడం ఏమాత్రం మంచిది కాదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల పట్ల అసభ్యంగా మాట్లాడే ధోరణిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని తేల్చిచెప్పారు.మహిళల గౌరవానికి భంగం కలిగించే చర్యలను మహిళా కమిషన్ ఎంతమాత్రం సహించదుమహిళల గౌరవానికి భంగం కలిగించే చర్యలను మహిళా కమిషన్ ఎంతమాత్రం సహించదని రాయపాటి శైలజ హెచ్చరించారు. "సోషల్ మీడియా వేదికల్లో అసభ్యకర వ్యాఖ్యలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి" అని ఆమె అన్నారు. సమాజంలో మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె గుర్తుచేశారు. సోషల్ మీడియాలో పరిధులు దాటి మహిళల పట్ల అవమానకరంగా ప్రవర్తించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని ఆమె హెచ్చరించారు

సీఎం చంద్రబాబును కలిసిన వైఎస్ షర్మిల..
కుమార్తె వివాహానికి ఆహ్వానం

-సీఎం చంద్రబాబును ఆయన నివాసంలో కలిసిన ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

-కుమార్తె వైఎస్ అంజలి రెడ్డి వివాహ ఆహ్వాన పత్రికను అందజేసిన షర్మిల

-కాబోయే దంపతులను ఆశీర్వదించాలని కోరినట్లు సోషల్ మీడియాలో పోస్ట్

-ఇప్పటికే పలువురు కీలక రాజకీయ ప్రముఖులను స్వయంగా ఆహ్వానించిన షర్మిల



ఉండవల్లి, అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్వయంగా కలిశారు. తన కుమార్తె వైఎస్ అంజలి రెడ్డి వివాహ మహోత్సవానికి హాజరుకావాల్సిందిగా కోరుతూ ఆయనకు వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. చంద్రబాబు నివాసానికి వెళ్లిన ఆమె, పెళ్లి కార్డును అందించి నూతన వధూవరులను ఆశీర్వదించాలని ఆహ్వానించారు.ఈ సందర్భంగా తన కుమార్తె అంజిలి రెడ్డి, కాబోయే అల్లుడు సోమల రఘురామ్ రెడ్డిల వివాహానికి సంబంధించిన వివరాలను చంద్రబాబుకు షర్మిల వివరించారు. పెళ్లికి తప్పనిసరిగా విచ్చేయాలని ఆమె కోరారు.సీఎం చంద్రబాబును కలిసిన అనంతరం వైఎస్ షర్మిల ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. చంద్రబాబుకు వెడ్డింగ్ కార్డు అందజేస్తున్న ఫొటోను పోస్ట్ చేస్తూ.. "ముఖ్యమంత్రి చంద్రబాబు గారిని తన నివాసంలో కలిసి నా కుమార్తె వైఎస్ అంజలి రెడ్డి - సోమల రఘురామ్ రెడ్డి ల వివాహ మహోత్సవానికి విచ్చేసి కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ వివాహ ఆహ్వాన పత్రికను అందించడం జరిగింది" అని పేర్కొన్నారు.

రాజకీయాలకు అతీతంగా పలువురు ప్రముఖులకు ఆహ్వానం

కుమార్తె వివాహాన్ని ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమవుతున్న వైఎస్ షర్మిల.. రాజకీయాలకు అతీతంగా పలువురు ప్రముఖులను స్వయంగా కలిసి ఆహ్వానిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ఎంపీ విజయసాయి రెడ్డితో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రముఖులకు ఆమె వివాహ ఆహ్వాన పత్రికలను అందజేశారు. తాజాగా ఏపీ సీఎం చంద్రబాబును కలిసి ఆహ్వానించడం ప్రాధాన్యత సంతరించుకుంది.షర్మిల కుమార్తె వివాహం నవంబరు 25న జరగనుండగా, డిసెంబరు 5న రిసెప్షన్ నిర్వహించనున్నారు.

అండర్-19 ఆసియా కప్ గెలిచిన భారత్..
చంద్రబాబు, లోకేశ్ అభినందనలు

-అండర్-19 ఆసియా కప్ 2026 గెలిచిన భారత జట్టు

-ఫైనల్‌లో పాకిస్థాన్‌పై చివరి బంతికి విజయం

-338 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించిన యువ భారత్

-టీమిండియాకు శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు, లోకేశ్



అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
అండర్-19 ఆసియా కప్ 2026 ఫైనల్‌లో అద్భుత విజయం సాధించిన భారత యువ జట్టును ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ సామాజిక మాధ్యమాల వేదికగా అభినందించారు. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్ జట్టుపై భారత యువ జట్టు సాధించిన విజయంపై చంద్రబాబు స్పందిస్తూ.. తీవ్రమైన ఒత్తిడిలోనూ యువ క్రికెటర్లు కనబరిచిన తెగువ, క్రీడాస్ఫూర్తి అమోఘమని కొనియాడారు. భారత క్రికెట్ చరిత్రలో ఇదొక మైలురాయిగా నిలిచిపోతుందని అభివర్ణించారు. ఈ విజయంలో భాగస్వామి అయిన ఆంధ్రప్రదేశ్ ఆటగాడు చిగురుపాటి వెంకటను మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు. లోయర్ ఆర్డర్‌లో 87 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పి, జట్టు గెలుపులో వెంకట కీలక పాత్ర పోషించాడని ప్రశంసించారు

స్వగ్రామంలో ముగిసిన గిరిబాబు అంత్యక్రియలు.. అశ్రునయనాల మధ్య ఆఖరి వీడ్కోలు

-నవంబరు 14న హైదరాబాదులో తుదిశ్వాస విడిచిన గిరిబాబు

-ఆదివారం ప్రకాశం జిల్లా స్వగ్రామం రావినూతలలో అంత్యక్రియలు


-తండ్రి చితికి నిప్పంటించిన పెద్ద కుమారుడు రఘుబాబు

-కన్నీటి వీడ్కోలు పలికిన కుటుంబ సభ్యులు, ప్రముఖులు

-ఐదు దశాబ్దాల సినీ ప్రస్థానంలో 600కు పైగా సినిమాలు







ప్రకాశం, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
ప్రముఖ టాలీవుడ్ సీనియర్ నటుడు గిరిబాబు (83) అంత్యక్రియలు ముగిశాయి. ప్రకాశం జిల్లా లోని ఆయన స్వగ్రామం రావినూతలలో ఆదివారం (నవంబర్ 15) సాయంత్రం అశ్రునయనాల మధ్య గిరిబాబుకు ఆఖరి వీడ్కోలు పలికారు. హైదరాబాద్‌లో నవంబర్ 14న తుదిశ్వాస విడిచిన ఆయన భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులు ఒంగోలు సమీపంలోని రావినూతలకు తరలించారు. తన అంతిమ సంస్కారాలు స్వగ్రామంలోనే జరగాలన్న గిరిబాబు చివరి కోరిక, కుటుంబ సభ్యుల నిర్ణయం మేరకు అక్కడే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

గిరిబాబు పెద్ద కుమారుడు, ప్రముఖ నటుడు రఘుబాబు అంత్యక్రియల ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. గ్రామ శ్మశాన వాటికలో బంధుమిత్రులు, గ్రామస్థుల సమక్షంలో శాస్త్రోక్తంగా అంతిమ సంస్కారాలు నిర్వహించారు. తండ్రి చితికి రఘుబాబు నిప్పంటించారు. తమ గ్రామానికి చెందిన వ్యక్తి సినీ రంగంలో అగ్ర నటుడిగా ఎదిగి తిరిగి ఊరి మట్టి లోనే కలవడంతో రావినూతల గ్రామంలో తీవ్ర భావోద్వేగాలు అలుముకున్నాయి. స్థానికులు, పరిసర ప్రాంతాల ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి గిరిబాబుకు కన్నీటి నివాళులు అర్పించారు.

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ఐదు దశాబ్దాలకు పైగా గిరిబాబు తనదైన ముద్ర

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ఐదు దశాబ్దాలకు పైగా గిరిబాబు తనదైన ముద్ర వేశారు. సుమారు 600కు పైగా చిత్రాల్లో నటించిన ఆయన విలన్‌గా, సహాయ నటుడిగా, హాస్య నటుడిగా ఎన్నో వైవిధ్యమైన పాత్రలను పోషించి మెప్పించారు. విలక్షణ నటనతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారు. ఆయన మృతి పట్ల టాలీవుడ్‌కు చెందిన పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ గిరిబాబు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఒక గొప్ప నటుడిని కోల్పోవడం తెలుగు చిత్రసీమకు తీరని లోటని సహచర నటులు కొనియాడారు.

త్రిపురాంతకం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా



త్రిపురాంతకం, మార్కాపురం, జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా త్రిపురాంతకం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను, పోలీస్ స్టేషన్ రికార్డులను, మరియు కేసుల నిర్వహణకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు.అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడి వారి విధులు, సమస్యలు, సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, విధుల పట్ల పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు.

పాము కాటుతో చికిత్స
పొందుతూ వ్యక్తి మృతి

మార్కాపురం,జర్నలిస్ట్ డైరీ :
మార్కాపురం మండలం జమ్మనపల్లి గ్రామానికి చెందిన చెరుకుపల్లి శివయ్య(55)అనే వ్యక్తి పాము కాటుకు గురయ్యాడు..పొలంలో గడ్డి కోస్తుండగా పాము కాటు గురైన అతను వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందారు

పొదిలి 'నగర పంచాయతీ' ఎన్నికలకు ఒకేరోజు 'నామినేషన్ల' వెల్లువ!

-పొదిలి చైర్‌పర్సన్, 28 వార్డులకు పోటాపోటీగా నామినేషన్లు

-పొదిలి నగర పంచాయతీలో ఒక్కరోజే 44 నామినేషన్లు

-పొదిలి చైర్‌పర్సన్ పదవికి 8.. వార్డు కౌన్సెలర్ అభ్యర్థులకు 36 నామినేషన్లు

-చైర్‌పర్సన్ పోటీకి టీడీపీ నుంచి 3, వైసీపీ నుంచి 3, కాంగ్రెస్ నుంచి 1, ఒక స్వతంత్ర అభ్యర్థి



పొదిలి,మార్కాపురం, జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
పొదిలి నగర పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పొదిలిలో నామినేషన్ల దాఖలు ప్రక్రియ జోరుగా కొనసాగుతోంది. ఆదివారం(నవంబర్ 15వ తేదీ) నాటికి చైర్‌పర్సన్, వార్డు సభ్యుల పదవులకు కలిపి మొత్తం 44 నామినేషన్లు దాఖలయ్యాయి.

చైర్‌పర్సన్ పదవికి మొత్తం 8 నామినేషన్లు
చైర్‌పర్సన్ పదవికి ఇప్పటివరకు మొత్తం 8 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో కాంగ్రెస్ పార్టీ నుంచి ఒకటి, తెలుగుదేశం పార్టీ నుంచి మూడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి మూడు, స్వతంత్ర అభ్యర్థిగా ఒక నామినేషన్ నమోదైంది.

నగర పంచాయతీలోని 28 వార్డులకు 36 నామినేషన్లు
అదేవిధంగా పొదిలి నగర పంచాయతీలోని 28 వార్డులకు సంబంధించి వార్డు సభ్యుల పదవులకు ఇప్పటివరకు 36 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో వైఎస్సార్‌సీపీ నుంచి 22, టీడీపీ నుంచి 3, జనసేన నుంచి 2, బీజేపీ నుంచి 1, స్వతంత్ర అభ్యర్థులుగా 3 నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో ఒక్కరోజులోనే పెద్దఎత్తున నామినేషన్లు నమోదయ్యాయి. నగర పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుండటంతో ఇంకా మరిన్ని నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉందని సర్వత్రా అభిప్రాయం వ్యక్తమవుతోంది

మేయర్, మున్సిపల్ చైర్మన్
అభ్యర్థులను ప్రకటించిన పవన్ కల్యాణ్

-మేయర్, మున్సిపల్ చైర్మన్ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసిన పవన్ కల్యాణ్

-శ్రీకాకుళం కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా డాక్టర్ దానేటి రాధారాణి

-కాకినాడ కార్పొరేషన్ మేయర్ బరిలో ఆకుల భవాని

-రాజాం, భీమవరం, తాడేపల్లిగూడెం చైర్మన్ అభ్యర్థుల ప్రకటన

-మంగళగిరి కేంద్ర కార్యాలయం నుంచి అధికారిక ప్రకటన విడుదల



మంగళగిరి,ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
ఆంధ్రప్రదేశ్ లోని రెండు మున్సిపల్ కార్పొరేషన్లు, మూడు మున్సిపాలిటీలలో మేయర్, ఛైర్మన్ స్థానాలకు పోటీ చేసే జనసేన అభ్యర్థులను పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఖరారు చేశారు. ఇటీవల ఎన్నికలు జరగ్గా మిగిలిన పట్టణ స్థానిక సంస్థల కు నవంబరు 26న పోలింగ్ జరగనుంది. 4 కార్పొరేషన్లు, 16 మున్సిపాలిటీలు, 3 నగర పంచాయతీలకు ఈ విడతలో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే బీజేపీ తాను పోటీ చేసే స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించింది. తాజాగా ఈ ఎన్నికల్లో బరిలో దిగే తమ అభ్యర్థుల పేర్లను ఖరారు చేసినట్లు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం ఆదివారం సాయంత్రం అధికారికంగా వెల్లడించింది.

మేయర్ పదవుల కోసం మహిళా నేతలకు పార్టీ అవకాశం
శ్రీకాకుళం, కాకినాడ కార్పొరేషన్లలో మేయర్ పదవుల కోసం మహిళా నేతలకు పార్టీ నాయకత్వం అవకాశం కల్పించింది. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా డాక్టర్ దానేటి రాధారాణిని ఎంపిక చేశారు. అలాగే కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా ఆకుల భవాని పేరును పవన్ కల్యాణ్ ఖరారు చేశారు.

మున్సిపాలిటీల విషయానికి వస్తే....
విజయనగరం జిల్లా రాజాం మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా బనిశెట్టి సౌజన్య లత బరిలో నిలవనున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మున్సిపాలిటీ ఛైర్మన్ అభ్యర్థిగా డాక్టర్ చుండూరి మల్లేశ్వరి, తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ ఛైర్మన్ అభ్యర్థిగా పాలూరు వెంకటేశ్వరరావు పేర్లను పార్టీ నాయకత్వం ఖరారు చేసింది.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సమర్థులైన నేతలను బరిలోకి దించేలా క్షేత్ర స్థాయి సమీక్షలు
స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరఫున సమర్థులైన నేతలను బరిలోకి దించే క్రమంలో క్షేత్ర స్థాయి సమీక్షలు నిర్వహించి, పార్టీ శ్రేణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే అధినేత పవన్ కల్యాణ్ ఈ అభ్యర్థులను ఎంపిక చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అభ్యర్థుల ప్రకటనతో ఆయా నియోజకవర్గాల్లో జనసేన పార్టీ శ్రేణులు ఎన్నికల ప్రచారానికి సమాయత్తమవుతున్నాయి

రోడ్డు ప్రమాదంలో 'తెలంగాణ 'ఐపీఎస్'
అధికారి రాజీవ్ హనుమంతుకు గాయాలు

-తిరుమల నుంచి శ్రీశైలం వెళ్తుండగా జాతీయ రహదారిపై స్కూల్ వ్యాన్‌ను ఢీకొన్న కారు

-ఈ ఘటనలో రాజీవ్ హనుమంతుతో పాటు ఆయన కుటుంబసభ్యులకు గాయాలు

-బాధితులను నెల్లూరు లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్య సేవలు

-తెలంగాణ రెవెన్యూ, స్టాంప్‌లు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీగా విధులు నిర్వహిస్తున్న 2012 బ్యాచ్ ఐపీఎస్ అధికారి రాజీవ్ హనుమంతు

-నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలం చాపరాళ్లపల్లి సమీపంలో 565వ నంబర్ జాతీయ రహదారిపై ప్రమాదం





ఆత్మకూరు, నెల్లూరు, జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
తెలంగాణ రెవెన్యూ, స్టాంప్‌లు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ, 2012 బ్యాచ్ ఐపీఎస్ అధికారి రాజీవ్ హనుమంతు ప్రయాణిస్తున్న కారు ఆంధ్రప్రదేశ్‌లో రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఆయనతో పాటు కుటుంబసభ్యులు గాయపడ్డారు. నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలం చాపరాళ్లపల్లి సమీపంలోని 565వ నంబర్ జాతీయ రహదారిపై ఈ ప్రమాదం చోటు చేసుకుంది.తిరుమల శ్రీవారి దర్శనం ముగించుకుని శ్రీశైలం వెళ్తుండగా...ప్రమాదం
రాజీవ్ హనుమంతు తన కుటుంబసభ్యులతో కలిసి కారులో తిరుమల శ్రీవారి దర్శనం ముగించుకుని శ్రీశైలం వెళ్తుండగా, మార్గమధ్యంలో వారి కారు ఎదురుగా వచ్చిన ఓ స్కూల్ వ్యాన్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న రాజీవ్ హనుమంతు, ఆయన కుటుంబ సభ్యులు గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు స్పందించి క్షతగాత్రులను తొలుత ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు.

నెల్లూరు లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించేలా ఏపీ మంత్రి ఆనం
ఏర్పాట్లు ఈ సమాచారం అందుకున్న ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెంటనే ఆత్మకూరు ఆసుపత్రికి చేరుకున్నారు. క్షతగాత్రులను పరామర్శించి, వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం కోసం వారిని నెల్లూరు లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించేలా ఏర్పాట్లు చేశారు.

రాజీవ్ హనుమంతుకు ఫోన్లో తెలంగాణ మంత్రి పొంగులేటి పరామర్శ
మరోవైపు, ఈ విషయం తెలిసిన వెంటనే తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఫోన్ ద్వారా రాజీవ్ హనుమంతును పరామర్శించారు. ఆయన కుటుంబసభ్యుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. ప్రమాదంపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హాస్టల్ నుంచి పండుగకు ఇంటికి వచ్చిన బాలిక అదృశ్యం..

జర్నలిస్ట్ డైరీ, ఎల్బీనగర్:
హాస్టల్ నుంచి ఇంటికి వచ్చిన బాలిక అదృశ్యమైన సంఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ చోటు చేసుకుంది. ఎల్బీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీఆర నగర్ లో నివాసం ఉండే సారంగి అనూష ఆమె సోదరి ఉమ భర్త మరణించడంతో ఆమె మరో వివాహం చేసుకుంది. వారికి కుమార్తె లక్ష్మి(15) 2024లో అమెను లింగంపల్లి సీడబ్లూసీ వారి సహకారంతో కాచిగూడ నింబోలిఅడ్డాలోని బాలికల వెల్ఫేర్ హాస్టల్లో చేరారు. అక్కడే ఉండి చదువుకుంటుంది. పండుగ నిమత్తం లక్ష్మి కోరిక మేరకు గత నెల 16వ తేదీన అనూష, ఆమె భర్త హాస్టల్ నుండి లక్ష్మిని ఎన్టీఆర్‌నగర్‌లోని తమ ఇంటికి తీసుకువచ్చారు. ఇటీవల హాస్టల్ యజమాన్యం లక్ష్మిని తిరిగి హాస్టల్‌కు పంపాలని సూచించగా ఆమె తిరిగి వెళ్లేందుకు ఇష్టపడలేదు. చదువు కొనసాగించాలని అనూష ఆమెకు నచ్చచెప్పారు. ఈ తేదీ 13 వ తేదీ ఉదయం హాస్టల్‌కు వెళ్లేందుకని కాల్ చేసింది అనూష చూచించగా లక్ష్మి బిస్కెట్లు కొనుక్కొస్తానని చెప్పి ఇంట్లో నుండి బయటకు వెళ్లిన లక్ష్మి తిరిగి ఇంటికి రాలేదు. చట్టుపక్కల ప్రాంతాల్లో, తెలిసిన చోట్ల వెతికినప్పటికీ ఆచూకీ కనిపించింది అనూష ఎల్బీనగర్ పోలీస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నటుడు గిరిబాబు భౌతికకాయానికి మోహన్ బాబు నివాళి

-55 ఏళ్ల నాటి స్నేహాన్ని గుర్తు చేసుకుని తీవ్ర భావోద్వేగం

-మద్రాస్‌లో రూమ్‌మేట్స్‌గా గడిపిన రోజులను పంచుకున్న నటుడు

-సొంత ఊరి అభివృద్ధికి గిరిబాబు చేసిన సేవలు ప్రశంసనీయం అని వెల్లడి

-గిరిబాబు కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పిన మోహన్ బాబు





ప్రకాశం, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
సీనియర్ నటుడు గిరిబాబు (83) మృతి పట్ల ప్రముఖ నటుడు మంచు మోహన్ బాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రకాశం జిల్లా కొరిశపాడు మండలం రావినూతలలో ఉంచిన గిరిబాబు భౌతిక కాయాన్ని మోహన్ బాబు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ధైర్యం చెప్పారు.

తీవ్ర భావోద్వేగానికి లోనైన మోహన్ బాబు
ఈ సందర్భంగా తన ప్రాణస్నేహితుడితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ మోహన్ బాబు తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు.గిరిబాబుతో తనకున్న 55 ఏళ్ల సుదీర్ఘ సాన్నిహిత్యాన్ని, సినీ ప్రస్థానం తొలినాళ్లలో మద్రాస్‌లో తామిద్దరం రూమ్‌మేట్స్‌గా గడిపిన రోజులను ఆయన నెమరువేసుకున్నారు. తాను ఒక గొప్ప స్నేహితుడిని, కుటుంబ సభ్యుడి వంటి ఆత్మీయుడిని కోల్పోయానని ఆవేదన చెందారు.

ఈ సందర్భంగా మోహన్ బాబు మాట్లాడుతూ..
"మా కుటుంబంలో ఇదొక విషాద సంఘటన. మాది 55 ఏళ్ల సాన్నిహిత్యం. గిరిబాబు గొప్ప స్నేహితుడు. ఆయన భార్య నాకు సొంత చెల్లెలు కంటే ఎక్కువ. ఇది మా రెండు కుటుంబాలలో విషాద సంఘటన. గిరిబాబు ఎన్నో మంచి పనులు చేశారు. నెలకు పదిసార్లు తన పుట్టిన ఊరు రావినూతలకు వచ్చేవాడు. ఇంత జర్నీ చేయడం ఎందుకు అని అంటే.. మా గ్రామానికి ఎంతో చేయాలని అనేవాడు. చాలామంది నటులు తమ పుట్టిన ఊరికి ఏమాత్రం చేస్తున్నారో అందరికీ తెలుసు. నేను ఒక గొప్ప స్నేహితుడిని, ఆత్మీయుడిని పోగొట్టుకున్నాను" అని భావోద్వేగంతో చెప్పారు.గిరిబాబు తన సొంత గ్రామం బాగు కోసం ఎంతో కృషి చేశారుగిరిబాబు తన పుట్టిన ఊరైన రావినూతల అభివృద్ధికి చేసిన సేవలను మోహన్ బాబు ఈ సందర్భంగా ప్రత్యేకంగా కొనియాడారు. చాలామంది నటులు సినీ రంగంలో స్థిరపడ్డాక తాము పుట్టిన ఊరిని పట్టించుకోరని, కానీ గిరిబాబు మాత్రం తన సొంత గ్రామం బాగు కోసం ఎంతో కృషి చేశారని తెలిపారు. గిరిబాబు మరణం చిత్ర పరిశ్రమతో పాటు వ్యక్తిగతంగా తనకూ పూడ్చలేని లోటని పేర్కొన్నారు

ఎల్‌నినో ప్రభావం.. ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులకు ప్రోత్సాహం

-నవంబర్ 16న కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ
-మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్



ఆమనగల్లు ,
నవంబర్ 15 జర్నలిస్ట్ డైరీ :
ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రోత్సాహం కల్పించేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా రైతులకు అవసరమైన విత్తనాలు, డ్రిప్, స్ప్రింక్లర్లు, సోలార్ ఫెన్సింగ్, మల్చింగ్ కవర్లు, కూరగాయల పందిళ్ల కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.ఆమనగల్లు మండలానికి చెందిన ఆసక్తి గల రైతులు నవంబర్ 16వ తేదీ సోమవారం ఒక్కరోజు మాత్రమే ఆమనగల్లు మండల కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు సంప్రదించాల్సిన ఆమనగల్లు క్లస్టర్ ఏఈఓ మీనాక్షి రాంనుంతల క్లస్టర్, భూదేవి ఆకుతోటపల్లి క్లస్టర్, ప్రభావతి పోలేపల్లి క్లస్టర్, రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా ముందుకు సాగాలని వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

బిజినెస్

భారీగా తగ్గనున్న బంగారం ధరలు!

- 2027 డిసెంబర్ నాటికి ఔన్స్ ధర 4,650 డాలర్లకు చేరే అంచనా
- 10 గ్రాముల పసిడి ధర రూ.1.20 లక్షలకు దిగొచ్చే అవకాశం
- అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల పెంపు ప్రభావం
- బంగారంపై తగ్గనున్న పెట్టుబడిదారుల ఆసక్తి
- ప్రభుత్వ బాండ్ల వైపు మళ్లనున్న మదుపరులు
- ధరల తగ్గుదలపై అంచనా వేసిన గోల్డ్‌మన్ సాచ్స్
- అంతర్జాతీయ పరిణామాలతో మారనున్న పసిడి మార్కెట్
- ఇప్పటికిప్పుడు నిర్ధారించలేమంటున్న విశ్లేషకులు



న్యూఢిల్లీ

పసిడి కొనుగోలుదారులకు ఊరటనిచ్చే అంచనాలు వెలువడ్డాయి. రానున్న రోజుల్లో అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని ప్రముఖ అంతర్జాతీయ ఆర్థిక సంస్థ గోల్డ్‌మన్ సాచ్స్ విశ్లేషించింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను పెంచవచ్చన్న అంచనాలు పసిడి ధరలపై ప్రభావం చూపనున్నాయని పేర్కొంది. వడ్డీ రేట్లు పెరిగితే బంగారంపై పెట్టుబడుల ఆకర్షణ తగ్గి, మదుపరులు ప్రభుత్వ బాండ్ల వైపు మళ్లే అవకాశముందని తెలిపింది. అమెరికా కేంద్ర బ్యాంకు వడ్డీ రేట్లను పెంచినప్పుడు ప్రభుత్వ బాండ్లపై వచ్చే ప్రతిఫలం ఆకర్షణీయంగా మారుతుంది. మరోవైపు బంగారంపై పెట్టుబడులకు వడ్డీ రూపంలో ఎలాంటి ఆదాయం లభించదు. దీంతో పెట్టుబడిదారులు బంగారం నుంచి తమ పెట్టుబడులను ఇతర సాధనాలకు మళ్లించే అవకాశం ఉంటుంది. ఫలితంగా పసిడికి డిమాండ్ తగ్గి అంతర్జాతీయ మార్కెట్లో ధరలు దిగివచ్చే పరిస్థితులు ఏర్పడవచ్చని ఆర్థిక విశ్లేషణలు సూచిస్తున్నాయి. గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా ప్రకారం 2027 డిసెంబర్ నాటికి ఔన్స్ బంగారం ధర 4,650 డాలర్లకు చేరవచ్చు. ఈ పరిణామం దేశీయ మార్కెట్‌పైనా ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ధరలు తగ్గితే భారత్‌లోనూ పసిడి ధరలు దిగివచ్చే అవకాశముంది. ఈ నేపథ్యంలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1.20 లక్షల స్థాయికి తగ్గవచ్చనే అంచనాలు వెలువడుతున్నాయి. అయితే దేశీయంగా బంగారం ధరలు అంతర్జాతీయ మార్కెట్‌తో పాటు రూపాయి మారకం విలువ, దిగుమతి సుంకాలు, పన్నులు, స్థానికంగా కొనుగోళ్ల డిమాండ్ వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ తీసుకునే నిర్ణయాలు, ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, భౌగోళిక రాజకీయ పరిణామాలు కూడా పసిడి ధరల గమనాన్ని ప్రభావితం చేస్తాయి. గోల్డ్‌మన్ సాచ్స్ వెల్లడించినవి భవిష్యత్ అంచనాలు మాత్రమేనని, ధరలు తప్పనిసరిగా అదే స్థాయికి చేరుతాయని భావించరాదని మార్కెట్ వర్గాలు సూచిస్తున్నాయి.

భారత మార్కెట్లోకి డెంజా
డీ9 లగ్జరీ ఎలక్ట్రిక్ కారు

-రూ.90 లక్షల ఎక్స్‌షోరూమ్ ధరతో ప్రీమియం ఎంపీవీ ఆవిష్కరణ
-ఒక్కసారి ఛార్జింగ్‌తో 730 కిలోమీటర్ల ప్రయాణ పరిధి
-115 కిలోవాట్ల బ్యాటరీతో శక్తివంతమైన విద్యుత్ వ్యవస్థ
-మసాజ్ సదుపాయంతో ప్రత్యేక కెప్టెన్ సీట్లు



న్యూఢిల్లీ:

భారత ఎలక్ట్రిక్ వాహన మార్కెట్లోకి మరో లగ్జరీ కారు ప్రవేశించింది. డెంజా సంస్థ తన ప్రీమియం ఎంపీవీ డీ9ను దేశీయ మార్కెట్లో అందుబాటులోకి తీసుకొచ్చింది. అధునాతన సాంకేతికత, విలాసవంతమైన ప్రయాణ సదుపాయాలు, ఎక్కువ ప్రయాణ పరిధిని లక్ష్యంగా రూపొందించిన ఈ కారును రూ.90 లక్షల ఎక్స్‌షోరూమ్ ధరతో విక్రయించనుంది. ఒక్కసారి పూర్తిగా ఛార్జింగ్ చేస్తే 730 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చని కంపెనీ ప్రకటించింది. డీ9లో 115 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన బ్యాటరీని ఏర్పాటు చేశారు. సుదూర ప్రయాణాలకు అనుకూలంగా ఉండేలా దీని ప్రయాణ పరిధిని రూపొందించినట్లు సంస్థ వెల్లడించింది. లగ్జరీ వాహనాలను కోరుకునే వారితో పాటు విద్యుత్ వాహనాల వైపు మొగ్గు చూపుతున్న వినియోగదారులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ కారును తీసుకొచ్చింది. ప్రయాణికుల సౌకర్యానికి ఇందులో ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. మసాజ్ సదుపాయం కలిగిన కెప్టెన్ సీట్లు ఏర్పాటు చేశారు. దీర్ఘ ప్రయాణాల్లో అలసట తగ్గించేలా ఈ సీట్లను రూపొందించారు. వినోదం కోసం 16 స్పీకర్లతో కూడిన అత్యాధునిక ధ్వని వ్యవస్థను అందించారు. విలాసవంతమైన అంతర్గత అలంకరణతో పాటు ప్రయాణ అనుభూతిని మెరుగుపరిచే సదుపాయాలు ఈ కారులో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. దేశంలోని ప్రధాన నగరాల్లో డీ9 బుకింగ్‌లు ప్రారంభమయ్యాయి. హైదరాబాద్‌లోనూ ఎంపిక చేసిన డీలర్‌షిప్‌ల ద్వారా ముందస్తు నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. బుకింగ్ కోసం రూ.10 లక్షల టోకెన్ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని సంస్థ తెలిపింది. లగ్జరీ ఎంపీవీ విభాగంలో ఇప్పటికే ఉన్న వాహనాలకు డెంజా డీ9 పోటీ ఇవ్వనుంది. ధర, ప్రయాణ పరిధి, విలాసవంతమైన సదుపాయాల ఆధారంగా ఈ కారు భారత మార్కెట్లో వినియోగదారులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో చూడాలి.

బీఎస్ఎన్ఎల్ అదిరిపోయే ఆఫర్.. రూ.51కే!

- కొత్త వినియోగదారులకు ఉచితంగా సిమ్ కార్డు
- కేవలం రూ.51తో 28 రోజుల సేవలు
- రోజుకు 2 జీబీ చొప్పున అంతర్జాల వినియోగం
- అపరిమిత ఉచిత కాలింగ్ సదుపాయం
- రోజుకు 100 సందేశాలు పంపుకునే వెసులుబాటు
- ఈ నెల 30వ తేదీ వరకు మాత్రమే ఆఫర్
- ఇతర సంస్థల నుంచి మారేవారికి ప్రత్యేక అవకాశం
- కొత్త వినియోగదారులను ఆకర్షించడమే లక్ష్యం



న్యూఢిల్లీ:

ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) కొత్త వినియోగదారుల కోసం ఆకర్షణీయమైన ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. తక్కువ ధరలో ఎక్కువ ప్రయోజనాలు పొందాలనుకునే వారికి ఈ అవకాశం ఉపయోగపడనుంది. ఈ ఆఫర్‌లో భాగంగా కొత్త వినియోగదారులకు ఉచితంగా సిమ్ కార్డును అందించడంతో పాటు, కేవలం రూ.51 రీఛార్జ్‌తో 28 రోజుల పాటు ప్రత్యేక సేవలను పొందే వెసులుబాటు కల్పిస్తోంది. ఈ పథకం కింద రోజుకు 2 జీబీ డేటా, అపరిమిత కాలింగ్ సదుపాయం, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు లభించనున్నాయి. తక్కువ ఖర్చుతో కాలింగ్, అంతర్జాల సేవలను వినియోగించుకోవాలనుకునే వారికి ఈ ఆఫర్ ప్రయోజనకరంగా ఉంటుందని సంస్థ భావిస్తోంది. ముఖ్యంగా ప్రైవేట్ టెలికాం సంస్థల అధిక ధరల రీఛార్జ్‌లతో ఇబ్బందులు పడుతున్న వినియోగదారులను ఆకర్షించేందుకు ఈ నిర్ణయం దోహదపడనుంది. ఇతర టెలికాం నెట్‌వర్క్‌లను వినియోగిస్తున్న వారు బీఎస్ఎన్ఎల్‌కు మారాలనుకుంటే ఈ ఆఫర్‌ను ఉపయోగించుకోవచ్చని సంస్థ పేర్కొంది. ఈ నెల 30వ తేదీ వరకు మాత్రమే ఈ అవకాశం అందుబాటులో ఉంటుందని వెల్లడించింది. అయితే ఆఫర్‌కు సంబంధించిన అర్హతలు, అమలు ప్రాంతాలు, ఇతర నిబంధనలను సిమ్ తీసుకునే ముందు బీఎస్ఎన్ఎల్ అధికారిక కేంద్రంలో నిర్ధారించుకోవడం మంచిది.

స్పోర్ట్స్

మైదానంలోనే యుద్ధం..
బయట స్నేహంగా ఉంటాం: శ్రేయస్ అయ్యర్

న్యూజిలాండ్ పర్యటనలో పరిమిత ఓవర్ల సిరీస్‌లు గెలవడంపై శ్రేయస్ హర్షం
మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో బౌలర్లు అత్యుత్తమంగా రాణించారని వెల్లడి
జట్టులో మార్పులు చేర్పులు ఉన్నా ఎలాంటి సాకులు వెతకలేదన్న కెప్టెన్
మైదానంలో తీవ్ర పోటీ ఉన్నా వెలుపల ఇరు జట్ల మధ్య చక్కని స్నేహం
మ్యాచ్‌లకు భారీగా హాజరై ప్రోత్సహించిన అభిమానులకు ప్రత్యేక ధన్యవాదాలు



న్యూజిలాండ్ పర్యటనలో టీ20, వన్డే సిరీస్‌లను కైవసం చేసుకోవడం జట్టుకు దక్కిన గొప్ప ఘనత అని టీమిండియా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ పేర్కొన్నాడు. నిరంతరం మారుతున్న వాతావరణం, విభిన్నమైన పిచ్ పరిస్థితులు అనేక సవాళ్లు విసిరినప్పటికీ, వాటన్నింటినీ అధిగమించి రెండు సిరీస్‌లలోనూ విజేతగా నిలవడం ఎంతో సంతృప్తినిచ్చిందని తెలిపాడు. ప్రస్తుతం న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న భారత జట్టు ఇప్పటికే టీ20 సిరీస్ గెలుచుకోగా, నేడు జరిగిన చివరి వన్డేలోనూ గెలిచి 3-1తో వన్డే సిరీస్ ను కూడా చేజిక్కించుకుంది. ఇవాళ్టి మ్యాచ్ ముగిసిన అనంతరం శ్రేయస్ అయ్యర్ జట్టు ప్రదర్శన, వ్యూహాలపై మాట్లాడాడు. ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్‌లో ఆశించిన స్థాయిలో పరుగులు చేయలేకపోయినా, మ్యాచ్‌ను ఏ క్షణంలోనైనా మనవైపు తిప్పుకోగలమనే గట్టి నమ్మకం తమలో ఉందని శ్రేయస్ చెప్పాడు. జట్టులోని ప్రతి ఆటగాడూ ఇదే సానుకూల దృక్పథంతో ఆలోచించారని, మైదానంలో ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేయగలిగామని వివరించాడు. ఈ సిరీస్ పూర్తిగా బ్యాటర్లకు అనుకూలించింది కాదని, ఇరు జట్లలోని బౌలర్లదే కీలక పాత్ర అని అన్నాడు. ముఖ్యంగా భారత బౌలర్లు తీవ్ర ఒత్తిడిని తట్టుకుని, పరిస్థితులకు అనుగుణంగా బౌలింగ్ చేసి జట్టుకు విజయాలు అందించారని కొనియాడాడు. ఆటగాళ్లలో కనిపించిన ఆత్మవిశ్వాసం, పోరాట తత్వమే జట్టును ముందుకు నడిపించాయని ప్రశంసించాడు. టెస్టు మ్యాచ్‌ల సన్నాహకాలు, ఆటగాళ్ల గాయాల కారణంగా తుది జట్టులో తరచూ మార్పులు చేయాల్సి వచ్చిందని శ్రేయస్ అయ్యర్ గుర్తుచేశాడు. జట్టులో మార్పులు చేర్పులు జరిగినప్పుడు పరిస్థితులకు అలవాటు పడటం ఆటగాళ్లకు కాస్త కష్టమైన విషయమేనని అంగీకరించాడు. అయితే, తాము ఏ దశలోనూ ఎలాంటి సాకులు చెప్పాలనుకోలేదని స్పష్టం చేశాడు. తమపై ఉన్న అంచనాలకు తగ్గట్టుగా ఆడాలని, మైదానంలోకి దిగిన ప్రతి ఒక్కరూ తమ అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలనే లక్ష్యంతోనే ముందుకు సాగామని పేర్కొన్నాడు. ఈ ద్వైపాక్షిక సిరీస్‌కు స్టేడియాలకు భారీగా తరలివచ్చిన భారత, న్యూజిలాండ్ అభిమానులకు శ్రేయస్ అయ్యర్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపాడు. ఫలితాలతో సంబంధం లేకుండా ఇరు జట్లను సమానంగా ప్రోత్సహించడం క్రీడాస్ఫూర్తికి నిదర్శనమని, ఇది చూడ్డానికి ఎంతో ముచ్చటగా ఉందని అన్నాడు. అభిమానుల నుంచి లభించే ఇలాంటి మద్దతే ఆటగాళ్లకు అసలైన స్ఫూర్తి అని పేర్కొన్నాడు. మైదానంలో దిగితే ఇరు జట్ల మధ్య తీవ్ర పోటీ ఉంటుందని, అది ఒక యుద్ధంలాంటి పోరాటమని చెబుతూనే.. మైదానం వెలుపల ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య చక్కని స్నేహం ఉంటుందని, క్రీడల్లో ఎప్పుడూ ఇలాంటి వాతావరణమే ఉండాలని శ్రేయస్ అయ్యర్ స్పష్టం చేశాడు.

గ్రౌండ్‌లో సూర్యకుమార్ విధ్వంసక బ్యాటింగ్..

- ఆపై మటన్ కర్రీ, రోటీలతో దావత్!
-తుపాను ఇన్నింగ్స్ తర్వాత నేలపై కూర్చొని మటన్ తిన్న సూర్యకుమార్
-సూర్యకుమార్, సర్ఫరాజ్ ఖాన్ మటన్ విందు వీడియో వైరల్
-హైదరాబాద్‌పై కేవలం 21 బంతుల్లోనే 60 పరుగులు బాదిన ముంబై కెప్టెన్
-15 బంతుల్లోనే మెరుపు హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న స్టార్ బ్యాటర్
-టీమిండియాలోకి త్వరలోనే రీఎంట్రీ ఇస్తానంటూ సూర్య ధీమా



సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో తుపాను ఇన్నింగ్స్ ఆడిన అనంతరం స్టార్ క్రికెటర్ సూర్యకుమార్ యాదవ్ ఓ స్నేహితుడి ఇంట నేలపై కూర్చొని మటన్ విందు ఆస్వాదించిన వైనం సోషల్ మీడియాలో విపరీతంగా ఆకట్టుకుంటోంది. కోల్‌కతా వేదికగా హైదరాబాద్‌పై ముంబై విజయం సాధించిన తర్వాత, సహచర ఆటగాడు సర్ఫరాజ్ ఖాన్‌తో కలిసి సూర్య వేడివేడి రొట్టెలు, ఘుమఘుమలాడే మటన్ కర్రీ, రోటీలు తింటూ కనిపించాడు. మైదానంలో పరుగుల విధ్వంసం సృష్టించే ఈ స్టార్ ఆటగాళ్లు, గదిలో కింద కూర్చొని ఎంతో నిరాడంబరంగా భోజనం చేయడం అభిమానులను అమితంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా భోజనం అద్భుతంగా ఉందని, మాట్లాడటం కంటే తినడానికే మనసవుతోందని సర్ఫరాజ్ సరదాగా చెప్పిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. అంతకుముందు జరిగిన మ్యాచ్‌లో ముంబై సారథి సూర్యకుమార్ యాదవ్ బ్యాట్‌తో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. హైదరాబాద్ నిర్దేశించిన 172 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కేవలం 21 బంతుల్లోనే 285.71 స్ట్రైక్ రేట్‌తో అజేయంగా 60 పరుగులు సాధించాడు. ఇందులో భాగంగా కేవలం 15 బంతుల్లోనే మెరుపు అర్ధశతకం బాది ఔరా అనిపించాడు. సూర్య మెరుపులతో ముంబై జట్టు కేవలం 13.1 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. టీ20 ప్రపంచకప్ విజయం తర్వాత భారత జట్టు ఎంపికలో చోటు దక్కకపోవడం తనను బాధించిందని సూర్య ఈ సందర్భంగా పేర్కొన్నాడు. తాను మళ్లీ టీమిండియాలో ఆడాలంటే తన ఆటతీరుతో మరోసారి తలుపులు బద్దలు కొట్టాల్సిందేనని స్పష్టం చేశాడు. దేశవాళీ క్రికెట్‌లో ఆకలి, ఆటపై పట్టు ఇంకా తగ్గలేదని సూర్య ఈ విధ్వంసకర ఇన్నింగ్స్ ద్వారా తేల్చిచెప్పాడు.

ఒక్క మ్యాచ్ ఓడినా మళ్లీ కోహ్లీనే కెప్టెన్‌ను చేయాలంటారు: డుప్లెసిస్

-విరాట్ కోహ్లీ మద్దతు వల్లే బాధ్యతలు సమర్థంగా చేపట్టానన్న మాజీ సారథి
-కోహ్లీ అండ లేకపోతే తాను పూర్తిగా విఫలమయ్యేవాడినని వ్యాఖ్య
-మ్యాచ్ ఓడిపోతే కోహ్లీనే మళ్లీ కెప్టెన్ చేయాలనే డిమాండ్ వస్తుందన్న డుప్లెసిస్
-కోహ్లీతో ఏర్పడిన స్నేహం ఎంతో ప్రత్యేకమైనదని వెల్లడి




ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టుకు నాయకత్వం వహించడం, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీతో ఉన్న అనుబంధంపై దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ ఫాఫ్ డుప్లెసిస్ ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు. విరాట్ కోహ్లీ నుంచి పూర్తి స్థాయి మద్దతు లభించడం వల్లే తాను ఆర్సీబీ సారథ్య బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించగలిగానని, అతడి అండ లేకపోతే తాను కెప్టెన్‌గా పూర్తిగా విఫలమయ్యేవాడినని స్పష్టం చేశాడు. క్రిక్‌ఇన్‌ఫో నిర్వహించిన 'క్రికెటర్స్ ఆన్ క్రికెటర్స్' కార్యక్రమంలో సహచర మాజీ ఆటగాడు డేల్ స్టెయిన్‌తో మాట్లాడుతూ డుప్లెసిస్ ఈ వివరాలను వెల్లడించాడు. 2021 సీజన్ ముగిసిన తర్వాత తనపై పనిభారాన్ని తగ్గించుకోవడానికి, బ్యాటింగ్‌పై మరింత దృష్టి పెట్టడానికి విరాట్ కోహ్లీ ఆర్సీబీ కెప్టెన్సీ నుంచి తప్పుకోవడం తెలిసిందే. ఆ తర్వాత 2022 వేలంలో ఆర్సీబీ ఫ్రాంచైజీ డుప్లెసిస్‌ను కొనుగోలు చేసి వెంటనే జట్టు పగ్గాలు అప్పగించింది. ఆ సమయంలో ఆర్సీబీ క్రికెట్ డైరెక్టర్‌గా ఉన్న మైక్ హెసన్.. జట్టుకు నాయకత్వం వహిస్తావా అని తనను అడిగాడని డుప్లెసిస్ గుర్తు చేసుకున్నాడు. మొదట కాస్త సందిగ్ధత ఉన్నప్పటికీ, విరాట్ కోహ్లీ నుంచి వచ్చిన ఒక మెసేజ్ ఆ సందేహాలన్నింటినీ పటాపంచలు చేసిందని డుప్లెసిస్ చెప్పాడు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక



చిరంజీవి 'కాకా'లో స్పెషల్ సాంగ్..

- రితికా సింగ్‌తో మాస్ స్టెప్పులు, షూటింగ్ కూడా పూర్తి!



మెగాస్టార్ చిరంజీవి వరుస సినిమాలతో అభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న క్రేజీ ప్రాజెక్టుల్లో 'కాకా' ఒకటి. దర్శకుడు బాబీ తెరకెక్కిస్తున్న ఈ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. సంక్రాంతి కానుకగా 2027 జనవరి 13న ఈ సినిమాను విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించి మరో ఆసక్తికరమైన వార్త ఫిలిం నగర్‌లో చక్కర్లు కొడుతోంది. సినిమాలో ఓ ప్రత్యేక పాట కోసం ప్రముఖ హీరోయిన్ రితికా సింగ్‌ను ఎంపిక చేసినట్లు ప్రచారం జరుగుతోంది. చిరంజీవి, బాబీ కాంబినేషన్‌లో గతంలో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' మంచి విజయాన్ని అందుకుంది. దీంతో వీరిద్దరి కలయికలో వస్తున్న 'కాకా' సినిమాపై అభిమానుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది.ఇక ఈ చిత్రంలో చిరంజీవి విభిన్నమైన ఛాయలున్న పాత్రలో కనిపించనున్నారని తెలుస్తోంది. గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో సాగే యాక్షన్ కథాంశంతో ఈ సినిమాను భారీ స్థాయిలో రూపొందిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఎస్.ఎస్. తమన్ సంగీతం అందిస్తున్నారు. తాజాగా తమన్ సినిమా ప్రమోషన్లకు సంబంధించి కీలక అప్‌డేట్ ఇచ్చారు. డిసెంబర్ 1 నుంచి ప్రచార కార్యక్రమాలకు సంబంధించిన ప్రత్యేక కంటెంట్ విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. దీంతో మెగాస్టార్ అభిమానుల్లో సినిమా ప్రమోషన్లపై ఆసక్తి పెరిగింది. ఇక తాజాగా వినిపిస్తున్న వార్త ప్రకారం ఈ సినిమాలో ఓ ప్రత్యేక డ్యాన్స్ నంబర్ ఉండబోతోందట. ఈ పాటలో హీరోయిన్ రితికా సింగ్ కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అంతేకాదు, ఇప్పటికే ఈ పాటకు సంబంధించిన షూటింగ్ కూడా పూర్తయినట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ఈ విషయాన్ని చిత్ర నిర్మాతలు అధికారికంగా ప్రకటించలేదు. రితికా సింగ్ గతంలో దుల్కర్ సల్మాన్ నటించిన 'కింగ్ ఆఫ్ కోత' సినిమాలో ప్రత్యేక పాటలో కనిపించింది. ఇప్పుడు చిరంజీవి సినిమాలోనూ స్పెషల్ సాంగ్ చేస్తే అభిమానులకు మరో ఆకర్షణగా మారే అవకాశం ఉంది. మెగాస్టార్‌తో కలిసి ఆమె వేసే స్టెప్పులు ఎలా ఉంటాయన్న ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా తమన్ మాస్ బీట్‌కు చిరంజీవి డ్యాన్స్ తోడైతే థియేటర్లలో అభిమానులకు పండగే అని చెప్పొచ్చు. ఈ సినిమాలో మరో ప్రత్యేక ఆకర్షణ బాలీవుడ్ నటుడు అనురాగ్ కశ్యప్. ఆయన ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. అలాగే మలయాళ నటి అనస్వర రాజన్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. చిరంజీవి ద్విపాత్రాభినయ ఛాయలున్న పాత్రలో కనిపించనున్నారనే ప్రచారం సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. దర్శకుడు బాబీ ఈసారి మెగాస్టార్‌ను సరికొత్త గ్యాంగ్‌స్టర్ లుక్‌లో చూపించేందుకు సిద్ధమవుతున్నారు. గతంలో చిరంజీవితో 'వాల్తేరు వీరయ్య' వంటి విజయవంతమైన చిత్రాన్ని అందించిన బాబీ, ఈ సినిమాతో మరోసారి సంక్రాంతి బరిలో మెగాస్టార్‌కు విజయాన్ని అందించాలని భావిస్తున్నారు.

ఓటీటీలోకి తరుణ్ భాస్కర్ 'క్రేజీ కళ్యాణం'.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే!



టాలీవుడ్ యంగ్ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్, టాలెంటెడ్ డైరెక్టర్ కమ్ యాక్టర్ తరుణ్ భాస్కర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం 'క్రేజీ కళ్యాణం'. భద్రప్ప గాజుల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో నరేష్, అఖిల్ రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. పూర్తి వినోదాత్మకంగా సాగే ఈ సినిమా ఓటీటీ రిలీజ్ డేట్ అధికారికంగా లాక్ అయింది.ప్రముఖ తెలుగు ఓటీటీ ప్లాట్‌ఫాం 'ఆహా' వేదికగా నవంబర్ 20, 2026 నుంచి ఈ చిత్రం స్ట్రీమింగ్ కానుంది. కేవలం తెలుగులోనే కాకుండా తమిళ భాషలోనూ ఈ సినిమా ఒకేసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. థియేటర్లలో ప్రేక్షకులను అలరించిన ఈ ఫ్యామిలీ మూవీని త్వరలోనే మీ ఇంటి వద్దే 'ఆహా'లో వీక్షించవచ్చు.

14 ఏళ్లు ప్రేమించుకొని బ్రేకప్ చెప్పుకున్నాం..

సినిమా తారల ప్రేమకథలు ఎప్పుడూ ఆసక్తికరంగానే ఉంటాయి. అందరి లాగే వారి జీవితాల్లోనూ ఎన్నో ఎత్తుపల్లాలు, ఊహించని మలుపులు ఉంటాయి. టాలీవుడ్ చందమామ కాజల్ అగర్వాల్, వ్యాపారవేత్త గౌతమ్ కిచ్లుల ప్రేమ ప్రయాణం కూడా సరిగ్గా అలాంటిదే. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కాజల్, తమ 14 ఏళ్ల ప్రేమ, మధ్యలో ఎదురైన బ్రేకప్, పెళ్లికి ముందు తాను పెట్టిన షరతు గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తమ ప్రేమ గురించి కాజల్ మాట్లాడుతూ.. "సుమారు 13-14 ఏళ్ల క్రితమే మేమిద్దరం ప్రేమించుకున్నాం. కానీ అప్పట్లో మా పరిస్థితులు అనుకూలించకపోవడంతో విడిపోవాల్సి వచ్చింది. ఆ తర్వాత ఎవరి జీవితాల్లో వారు బిజీ అయిపోయాం. ఇద్దరం వేర్వేరు వ్యక్తులతో డేటింగ్ కూడా చేశాం" అని నిజాయితీగా చెప్పారు.వేరే వ్యక్తులతో రిలేషన్‌షిప్‌లో ఉన్నప్పుడే, తమ ఇద్దరి మధ్య ఉన్న ప్రత్యేకమైన బంధం ఏంటో వారికి అర్థమైందట. "బహుశా ఒకరి విలువ మరొకరికి తెలియడానికే మేము వేరే వాళ్లతో డేటింగ్ చేశామేమో.! చివరకు విధి మమ్మల్ని మళ్లీ కలిపింది. మా దారులు ఒక్కటయ్యాయి" అంటూ కాజల్ నవ్వుతూ చెప్పుకొచ్చారు. రెండోసారి దగ్గరైన తర్వాత, ఈసారి బంధం విషయంలో ఎలాంటి అస్పష్టత ఉండకూడదని కాజల్ గట్టిగా నిర్ణయించుకున్నారు. అందుకే గౌతమ్‌కు నేరుగా ఒక అల్టిమేటం ఇచ్చారట. "నేను గౌతమ్‌తో ఒకటే మాట చెప్పాను.. 'ఓకే బాస్, ఈసారి మనం కచ్చితంగా పెళ్లి చేసుకోవాలి, లేదంటే శాశ్వతంగా గుడ్‌బై చెప్పుకోవాలి' అని తేల్చి చెప్పేశాను" అని కాజల్ వివరించారు. గౌతమ్ కూడా అదే ఆలోచనతో ఉండటంతో వీరి పెళ్లికి మార్గం సుగమమైంది. ఇరు కుటుంబాల అంగీకారంతో 2020 అక్టోబర్ 30న ముంబైలో అత్యంత సన్నిహితుల సమక్షంలో వీరి వివాహం ఘనంగా జరిగింది. 2022 ఏప్రిల్‌లో వీరికి కుమారుడు 'నీల్' జన్మించాడు. ప్రస్తుతం ఒకవైపు తల్లిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే, మరోవైపు పాన్ ఇండియా సినిమాల్లో వరుస అవకాశాలతో కాజల్ తన సెకండ్ ఇన్నింగ్స్‌ను విజయవంతంగా కొనసాగిస్తున్నారు. నిజమైన ప్రేమ ఎక్కడికి వెళ్లినా తిరిగి తన గమ్యాన్ని చేరుకుంటుందనేందుకు కాజల్-గౌతమ్ జంట ఒక చక్కటి ఉదాహరణగా నిలుస్తోంది.

కిరణ్ అబ్బవరం 'రియాలిటీ'పై హైప్ పెంచేస్తున్న సాంగ్స్



హిట్టు ఫ్లాపులతో సంబంధం లేకుండా కంటెంట్‌ను నమ్మి సినిమా చేసే యాక్టర్లలో ఒకరు కిరణ్ అబ్బవరం . ఈ టాలెంటెడ్ యాక్టర్ నటిస్తోన్న తాజా సినిమా రియాలిటీ . సినిమా హిట్టవ్వాలంటే మ్యూజిక్ కూడా చాలా ముఖ్యమని తెలిసిందే. పాటలు బ్లాక్ బస్టర్ అయ్యాయంటే సినిమా దాదాపు హిట్టయినట్టేనని చెప్పొచ్చు. ఇప్పుడు రియాలిటీ మూవీ కూడా ఇదే లైన్‌లో వెళ్తూ టాక్ ఆఫ్ ది టాలీవుడ్‌గా నిలుస్తోంది.ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన భజ గోవిందం పాట తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ చూసినా మార్మోగిపోతూ ట్రెండింగ్‌లో నిలుస్తూ.. సినిమాకు సూపర్ బజ్ క్రియేట్ చేస్తోంది. మరో సాంగ్ =ఔట్టబబ కూడా మ్యూజిక్ లవర్స్‌ను ఇంప్రెస్ చేస్తోంది. మిడిల్ క్లాస్ ఫ్యామిలీ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ సినిమాపై రెండు పాటలు క్యూరియాసిటీ అమాంతం పెంచేస్తున్నాయి. ఈ మూవీ డిసెంబర్ 25న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇక భీమ్స్ సిసిరోలియో కంపోజ్ చేసిన మూడో పాట రఘుకుల తిలక రా రా కూడా అందరినీ ఇంప్రెస్ చేయడం పక్కా అని మూవీ లవర్స్ చర్చించుకుంటున్నారు. కొన్నాళ్లుగా మంచి బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న కిరణ్ అబ్బవరానికి రియాలిటీ ఎలాంటి సక్సెస్ అందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. కిరణ్ అబ్బవరం రైటర్ కమ్ డైరెక్టర్‌గా వస్తోన్న ఈ చిత్రంలో దేవికా భట్ మీరోయిన్‌గా నటిస్తోంది. శరత్ కుమార్, సాయి కుమార్, రోహిని, అన్నపూర్ణమ్మ, సుదర్శన్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జోయ్ ఫిల్మ్స్ బ్యానర్‌లో సుధాకర్ చాగంటి తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి సురేశ్ యెర్ర కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు.

ప్రశాంత్ నీల్ హారర్ థ్రిల్లర్ '418'ను థియేటర్లలో మిస్సయ్యారా..?



టాలీవుడ్ టాప్ బ్యానర్లలో ఒకటైన మైత్రీ మూవీ మేకర్స్ కాంపౌండ్ నుంచి వచ్చిన చిత్రం 418 . హారర్ జోనర్‌లో తెరకెక్కిన ఈ చిత్రంలో పతంగ్ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఇంటర్నెట్, సోషల్ మీడియా పర్సనాలిటీ ప్రీతి పగడాల లీడ్ రోల్‌లో నటించగా.. చరణ్ లక్కరాజు, సూర్య రాజ్ కీలక పాత్రలు పోషించారు.ప్రశాంత్ నీల్ సమర్పణలో తెరకెక్కిన ఈ మూవీని కీర్తన్ నాదగౌడ డైరెక్ట్ చేశారు. అక్టోబర్ 26న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలై ఈ చిత్రానికి మిక్స్‌డ్ రివ్యూస్ రాబట్టుకుంది. అయితే థియేటర్లలో ఈ సినిమాను మిస్సయిన వారి కోసం ఆసక్తికర అప్‌డేట్ వచ్చేసింది. 418 ఇక ఓటీటీలోనూ సందడి చేయనుంది. పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్‌లో నవంబర్ 19 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ మూవీ పలు ప్రధాన భారతీయ భాషల్లో అందుబాటులో ఉండనుంది. మరి ఓటీటీలో ఈ చిత్రానికి ఎలాంటి స్పందన వస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ చిత్రం సూర్య రాజ్, శషాంక్ పాటిల్, రమేశ్ ఇందిర ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. దినేశ్ దినకరన్, సినిమాటోగ్రఫర్‌గా పనిచేసిన ఈ చిత్రానికి వెంకీ జీజీ మ్యూజిక్ కంపోజర్‌గా వ్యవహరించాడు.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465